
# కథాకవిత్వము

తెనుఁగులెంక
**తుమ్మల సీతారామమూర్తి**



తుమ్మల
కళాపీఠం
గుంటూరు

తుమ్మలవారి

# కథాకవిత్వము

తెనుఁగులెంక

## తుమ్మల సీతారామమూర్తి

సంకలన కర్త

**తుమ్మల శ్రీనివాసమూర్తి**

# కథా కవిత్వము

## తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి


**ప్రథమ ముద్రణ : మార్చి 2007**

**ప్రతులు : 500**

**మూల్యము : 10/-**

ప్రతులకు :

**1. తుమ్మల కళాపీఠము**

**జె.కె.సి. కళాశాల**

**గుంటూరు - 522 006.**

**2. తుమ్మల శ్రీనివాసమూర్తి**

**43-గౌతమపురి కాలని,**

**ఎఱ్ఱగడ్డ, పి.ఓ.**

**హైదరాబాద్ - 500 018**

**ఫోన్ : 040-23833959**

ముద్రణ :

**రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్**

అమీర్‌పేట, హైదరాబాద్, ఫోన్ : 040-23731620.

## “తెనుఁగులెంక” తుమ్మల సీతారామమూర్తి
## జీవితము-కృతులు

**జననం:** 25-12-1901 కావూరు, రేపల్లె తాలుకా, గుంటూరు జిల్లా.

**తల్లిదండ్రులు:** చెంచమాంబా నారయ్యలు.

**గురువులు :** కావూరి శ్రీరాములుగారు, జాస్తి సుబ్బయ్యగారు, తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు, దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు.

**విద్య:** ఉభయభాషాప్రవీణ (ప్రథమశ్రేణి) ఆంధ్రవిశ్వవిద్యాలయము 1930.

**వృత్తి :** సేద్యము, తరువాత అధ్యాపనము, దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల, మున్నగు చోట్లగల ఉన్నత పాఠశాలలు

**దేశసేవ:** 1920 - 1930 వరకు కాంగ్రెసు సేవ; శిక్ష - 1922.

**అభిమాన విషయములు :** గ్రామ జీవనము, గాంధీతత్త్వము, సర్వోదయము, ఆంధ్రాభ్యుదయము, భారతీయుల సమగ్రత, తిక్కన కవితా మార్గము, చిన్నయ్యసూరి సిద్ధాంతము.

**కృతులు :** ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, గాంధీగానము, సర్వోదయగానము, రాష్ట్రగానము, ఉదయగానము, పఱిగపంట, శబల, పైరపంట, సమదర్శి, కదంబకైత, చక్కట్లు, దివ్యజ్యోతి, ఆత్మార్పణము, ధర్మజ్యోతి, ఎక్కట్లు, సందేశసప్తశతి, నేను, నా కథలు, తపస్సిద్ధి, తెనుఁగునీతి, గీతాదర్శము, హనుమాన్ చాలీసా, రామకృష్ణస్మృతి. ఇంకనూ కొన్ని శతకములు, నాటకములు, హరికథలు, జంగంకథలు మున్నగునవి.

**సన్మానములు :** 1949 నిడుబ్రోలులో గజారోహణము, గండపెండేరము, కనకాభిషేకము, సువర్ణకంకణము; 1960లో అఖిలభారతతెలుగురచయితల మహాసభసత్కారము; 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ విశిష్టసభ్యత్వ ప్రదానము; 1969లో కేంద్రసాహిత్య అకాడమీ బహుమానము (మహాత్మకథకు); 1969లో ఆంధ్రవిశ్వవిద్యాలయము “**కళాప్రపూర్ణ**”, 1985లో నాగార్జున విశ్వవిద్యాలయము డి.లిట్ బిరుదులతో సత్కారము; 1985లో విశాఖపట్నములో సహస్రపూర్ణచంద్రదర్శనమహోత్సవము; యల్.వి. రామయ్య చారిటీస్ (మద్రాసు)వారి ఘనసన్మానము; 1987లో గుంటూరు, విజయవాడలలో ఘనసన్మానములు; ఇంకనూ అనేక పట్టణములలో గ్రామములలో

**జయంతి మహోత్సవములు:** 1952 నుండి పెక్కుచోట్ల.

**బిరుదులు :** పండితుల, కవుల దృష్టిలో “**అభినవ తిక్కన**”, తన దృష్టిలో “తెనుఁగులెంక”.

**నిర్యాణము:** 21-3-1990 అప్పికట్ల, బాపట్ల తాలుకా, గుంటూరు జిల్లా.

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయము | పుటసంఖ్య |
|---|---|---|
| 1. | కొనియాట | I |
| 2. | మొగమాట | II |
| 3. | కృతజ్ఞతాకానుక | III |
| 4. | కృత్యాది | IV |
| 5. | కర్ణుఁడు | 1 |
| 6. | నిరాశ | 5 |
| 7. | వీరధర్మము | 9 |
| 8. | సేవాధర్మము | 13 |
| 9. | ఆదర్శవీరుడు | 18 |
| 10. | నా కథ-సీత | 21 |
| 11. | మంచి మేల్కొన్నది | 27 |
| 12. | నా కొడుకులు సోమరులు కారాదు | 31 |
| 13. | ముక్తి పాఠము | 32 |
| 14. | గృహస్థధర్మము | 34 |

# కొనియాట

ఆధునిక ఆంధ్ర కవులలో భారతీయ వైభవాన్ని వేనోళ్ల కొనియాడిన కవులలో తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తిగారు ప్రథమగణ్యులు. మహాత్ముని జీవిత కథను ఒక వంక చిత్రిస్తూ, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని పాఠకుల హృదయాలలోకి ప్రవేశపెట్టిన జాతీయ కవితామూర్తి సీతారామమూర్తి. తెలుగుజాతి సంస్కృతికి నిలువుటద్దంలా నిలిచిన తుమ్మలవారి రచనలన్నింటిని కలిపి పునర్ముద్రించటం ఈ కాలంలో ఊహించలేని పని కాని ఈ పనిని తుమ్మలకళాపీఠం విజయవంతంగా పూర్తిగావించింది. వారి గ్రంథాలన్నియు నాలుగు సంపుటాలుగా ప్రచురించబడినవి; ఒక అమూల్యమైన సావనీర్ కూడా ముద్రించబడినది. ప్రతి సంవత్సరము డిసెంబర్‌లో తుమ్మలవారి జయంతి సందర్భమున ఉత్తమ రచయితలను "తుమ్మల సాహిత్య పురస్కారము"తో సన్మానించుకొంటున్నది. డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతను ఈ సంస్థ అనేక సాహిత్య కార్యక్రమాలను విజయవంతముగా నిర్వహించుచున్నది.

తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తిగారి జ్యేష్ఠ కుమారులు శ్రీ శ్రీనివాసమూర్తి విషయ ప్రధానముగా మహాకవి తుమ్మలవారి పద్యరత్నములను సేకరించి తుమ్మల కళాపీఠము ద్వారా ప్రచురించి ఆంధ్రపాఠకలోకమునకు అందించుచున్నారు. "ఆంధ్ర ప్రశస్తిని" చరిత్రకారులు, బహుభాషావేత్తలు కీర్తిశేషులు పులిచెర్ల. సుబ్బారావుగారి జ్ఞాపకార్థముగా; "పండుగ కవితలు"ను ప్రముఖ వాణిజ్య వేత్తలు, విద్యా పోషకులు శ్రీ పోలిశెట్టి ఏకనాథగుప్తగారికి ఉడుగరగా; "తెనుఁగు తీపి"ని ఆదర్శవైద్యులు డా॥ ముద్దన హనుమంతరావుగారికి కృతజ్ఞతాకానుకగా సమర్పించినారు.

"మాతృదేవోభవ" అని మన విశ్వాసం. శ్రీనివాసమూర్తిగారు తుమ్మలవారి కథాకవితలను సంకలనంగావించి, "కథాకవిత్వము" అను పేరుతో ముద్రించి, వారి అమ్మగారికి ఉడుగరగానిచ్చి, మన సనాతనధర్మాన్ని ఆచరించిచూపటం ముదావహము. "కథాకవిత్వము" అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భమున శ్రీ శ్రీనివాసమూర్తి వారి తల్లిగారైన అన్నపూర్ణమ్మగారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించి వారు తల్లి ఋణమును తీర్చుకొనుచున్నారు. ఈ పని చాలా సముచితముగానున్నది; సంతోషకరముగా కూడా ఉన్నది. ఈ గ్రంథము నందు సందేశాత్మకమైన కథలు కలవు. ఈ కథా కవితలు తుమ్మలవారి కథాకథన కౌశల్యమును తేటతెల్లముచేయుచున్నవి.

సర్వజిత్ ఉగాది
2007

డా॥ పులిచెర్ల. సాంబశివరావు
కార్యదర్శి
తుమ్మల కళాపీఠము,
గుంటూరు.

# మొగమాట

20వ శతాబ్దపు తెనుగు మహాకవులలో శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారొకరు. వారి కవిత కాలానికి అతీతమైనది. వారి జీవితము నియమబద్ధమై సత్యసుందరమై ఆదర్శప్రాయమైనది. వారి కవిత్వంతో పాటు వారి జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కూడా పరిగణించి గణించితే పై మహాకవులలో వారు ప్రథమగణ్యులౌతారు. అమూల్యము, అజరామరము అయిన వారి కవితా సంపదకు అందరు భాషాభిమానులు, జాతీయవాదులు, మానవతావాదులు వారసులే. వారితో పాటు వారి సంతానము కూడా ఆ వారసత్వాన్ని అందిపుచ్చుకొని ఆ కవితా సంపదకు 'ప్రతివర్షవసంతోత్సవాలు' నిర్వహించటం ఎంతో ముదావహము, శోభాయమానము.

కవిగారి ప్రథమ కుమారుడు శ్రీనివాసమూర్తిగారు ఈ సంవత్సరం మన కందిస్తున్న కానుక "తుమ్మలవారి కథాకవిత్వము". మానవుల జీవితములతోపాటు పశుపక్ష్యాదుల జీవితములు కూడా కథార్హములే. తుమ్మలవా రీరెంటినీ తమ రచనా వ్యాసంగంలో గ్రహించారు. ఒక విధంగా చూస్తే వారి కవితలలో అధిక శాతము కథాకవితలే. ఇవి ప్రధానంగా మానవ జీవితాలను ఆశ్రయించినవి. మహాత్మాగాంధి, ఆచార్య వినోబాభావే, తను తనతండ్రి ప్రధాన వ్యక్తులు. వ్యక్తులు ఎవరైనా, మానవ జీవితతత్వాన్ని, సార్వజనీనమైన ఆదర్శ జీవన విధానాన్ని విప్పి చెప్పేందుకే తుమ్మలవారు ఆయా కథలను కవిత్వీకరించారు. తన నుడిలో, నడవడిలో ఋజుత్వాన్ని రంగరించుకొన్న మానవోత్తములు గదా వారు! 'ఔచితీ శౌచముఖదీప్తులు' 'సాధుశీల మాభిజాత్యము చెలువము' నిండిన పలుకులతో 'సామాజిక కళ్యాణము' కామించిన ఋషికల్పులు గదా వారు! వారి కథాకథనం తదితరంగా ఉండేందుకు వీలులేదు. పక్షులను పాత్రలనుగా జేకొని కథ నిర్వహించుట సాహిత్యమున నొక సంప్రదాయము కలదు. తుమ్మలవారు కూడ భారతీయ ఆదర్శదాంపత్యమునకు చిహ్నముగా కపోతికపోతముల అన్యోన్యమైన దాంపత్యమును వర్ణించుచు "ఆత్మార్పణము" అను చిన్న ప్రబంధకావ్యమును కూడ వ్రాసి యున్నారు.

ఈ సంకలన గ్రంథంలో పది కథాకవితలు కూర్చబడినవి. ఇవి సందేశాత్మకములైన గాథలు. దిలీపుడు (సేవా ధర్మమునకు), సీత (వినయ సంపదకు), శంతనుడు (వంశప్రతిష్ఠకు, లోకాపవాదభీతికి), కర్ణుఁడు (స్నేహ ధర్మమునకు), బాలచంద్రుడు (దేశభక్తికి), తుకారామ్ (నీతిబోధకు), తేజ బహద్దూర్ (ధైర్యమునకు), వినోబాభావే (విశ్వశాంతికి), ఆదర్శగృహస్థుడు (మానవత్వమునకు), - వీరిని ఆశ్రయించుకొన్నవీ కవితలు. పురాణకాలంనుండి ఆధునిక కాలం వరకు గల వ్యక్తుల కథాంశాలుగల కవితలు ఎంపిక చేయబడ్డాయి. అంతేకాదు క్రీ.శ. 1926 నుండి 1974 వరకు సుమారు 50 సంవత్సరాల కాలంలో రచించబడిన కవితలు గ్రహించబడ్డాయి. ఇవి తుమ్మలవారి కవితావస్తు స్వీకరణ విధానానికి, వారి భావవికాస వ్యక్తిత్వ పరిణతుల పరిశీలనకు, కథాకథన దక్షతకు,

కథాకథన దక్షతకు, ఉదాత్త సన్నివేశకల్పనా చాతురికి, కవితారీతి పరిణామక్రమాను శీలనకు మచ్చుతునుకలుగా నిలుస్తాయి. ఎంతో విస్తృతిగల తుమ్మలవారి కవితా తరంగిణిలోని వివిధ ఘట్టాలనుండి ఈ తీర్థజలాలను సేకరించి కవితాపిపాసులకు పంచుతున్న శ్రీనివాసమూర్తిగారు ఎంతో అభినందనీయులు.

"దుర్వారోద్యమ శౌర్యవీర్యవిలసద్దోర్గర్వమేపార" (కర్ణుఁడు) అంటూ తమ కవితాభ్యాసాన్ని ప్రదర్శించుకొంటూ; 30 నిమిషాలలో 50 పద్యాలను (నా కథ-సీత) ఆశువుగా చెప్పే సామర్థ్యాన్ని నిరూపించుకొంటూ; "కుత్తుకలుగోసి నెత్తురు కూడుగాదు, తృష్ణలనుద్రుంచి యమృతమందించునతడు, విప్లవముగాదు వానిది విశ్వశాంతి, కాదరువుగా నెసంగు సర్వోదయంబు" (మంచి మేల్కొన్నది) అంటూ; స్వీయపద్య శిల్పావిష్కరణ గావించుకొంటూ తెనుఁగులెంకగా సాగిన తుమ్మలవారి కవితారీతులు ఈ కథాకవితలలో స్థాలీపులాకంగా మనకు కన్పిస్తాయి. అంతేకాదు. "కొడుకులను సోమరులఁజేయు కోర్కిలేని, మానిసిని నేను; సోమరి మహికి వ్రేగు" (నా కొడుకులు సోమరులు కారాదు) అన్న ఆశయము, "ఈశ్వరార్పణ దృష్టితో నెల్లపనులు, పూనెదను నేను ఫలసంగ బుద్ధిలేక, వచ్చుబడులందు (రాబడి) సగము పాలిచ్చుచుందు, నతిథి కభ్యాగతునకు నిండారు పేర్మి" అన్న జీవితాదర్శము, ఆచరణలు; "అతిథి శిష్టమైన యన్నము, నిజవధూతృప్తి, దానశీల మింద్రియముల నగ్గపఱచుకొంట, యణకువ, పితృభక్తి" (గృహస్థధర్మము) - వీటిని వలచి అఘదూరునిగా తరించే వైనము; లను ప్రవచించటమేకాక ఆచరించే మహనీయస్థితికి తుమ్మలవారు ఎదిగిన తీరు కూడా ఈ కథాకవితల ద్వారా దర్శించగలము.

తెనుఁగుతీపితో ప్రవర్థమానమైన తుమ్మలవారి కవితాలతలకు విరబూసిన విరులు తెనుఁగుతోటలో ఇగిరిపోని సుగంధాలను నిరంతరం విరజిమ్ముతూ తెనుఁగువారికి ఉద్దీప్తిని కలిగిస్తూనే ఉంటాయి.

ఈ సంకలన గ్రంథమును శ్రీనివాసమూర్తిగారు అంతర్జాతీయ మహిళా దినోత్సవమును పురస్కరించుకొని వారి అమ్మగారికి (తుమ్మలవారి అర్థాంగి అన్నపూర్ణమ్మ) కృతజ్ఞతా కానుకగా సమర్పించుట చాలా సముచితముగా నున్నది.

**-డా॥ సూర్యదేవర రవికుమార్**

## కృతజ్ఞతలు

విడుమరలేని సాహిత్యపరిశోధనా పనియున్నను ఈ గ్రంథమును చక్కగా సమీక్షించిన డా॥ సూర్యదేవర రవికుమార్ గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలను తెలియజేయుచున్నాను.

ఇంకనూ తుమ్మలవారి కవితను విషయ ప్రధానముగా సంకలన గ్రంథములుగా ప్రచురించుటకు నన్ను ప్రోత్సహించుచున్న శ్రీ పులిచెర్ల. సాంబశివరావుగారికి, డా॥ రవికుమార్ గారికి నా నమస్కారములను తెలియజేయుచున్నాను.

-తుమ్మల శ్రీనివాసమూర్తి

# కృతజ్ఞతా కానుక

అంతర్జాతీయ మహిళాదినోత్సవమును (8-3-07) ప్రపంచదేశములు ఘనముగా నిర్వహించినవి. ఈ సందర్భమున "కథాకవిత్వము" (తెనుఁగులెంక కథా కవితలు) అను సంకలన గ్రంథమును మా అమ్మగారికి కృతజ్ఞతాకానుకగా చాలా సంతోషముతో సమర్పించుకొనుచున్నాను - అమ్మ ఋణమును కొంత వరకు తీర్చుకొనుటకు.

ఒజ్జ కంటె జనకుఁ డుఁబదివుగా, జనకుని
కంటె జనని గణ్యగా వచించి
రాదిఋషులు, పేద, కర్థవంతున కమ్మ
యుంట బహుసుఖాలపంట యనిరి-

అమ్మను మించిన దైవము వేఱే లేదని పెద్దలు చెప్పినారు. మొదట మానవుడు "అమ్మ"ను పూజించి నాడు; మానవజాతి మనుగడకు అమ్మయే మూలమని గ్రహించినాడు. 'అమ్మ' అనునది ఒక కమ్మని మాట; మధురానుభూతులను కలిగించు తీయనిమాట. అమ్మ ప్రేమమయి, అమృతమయి, త్యాగమయి, కరుణామయి, సేవామయి, సహనమయి. అమ్మ ఉన్న యింటిలో అన్నీ యున్నట్లే. అమ్మప్రేమను పొందిన పిల్లలే పిల్లలు. అమ్మయున్న యిల్లు స్వర్గము వంటిది.

మా అమ్మగారు తెనుఁగులెంక తుమ్మలవారి అర్థాంగి అన్నపూర్ణమ్మ. "పేరు కొందరకున్ నేతిబీఱకాగ, కొందఱకు రసాలంబయి కూర్చు యశము"- ఆమె సార్థకాఖ్య. ఆమె బంధువులను గౌరవించినది; పేదలను ఆదరించినది. ఆజానజములైన ఆమె వినయము, దయ, సేవ, ఓర్పులు కొనియాడదగినవి. ఆమెదైవభక్తి పరురాలు. ఆమె పతిభక్తిగల సహధర్మచారిణి. శ్రీరాముని పూజించినట్లుగా ఆమె భర్తసీతారాముని గొల్చినది. ఆమె చక్కని సంతానమును కని వారిని "మధురశీల ధీగరిష్టత గనునట్లు" తీర్చిదిద్దినది. ఆమె మాకు క్రమశిక్షణ నేర్పె, నీతి నేర్పె, ధర్మనిరతి నేర్పె, ఉదారసరణి నేర్పె చదువు సంధ్య నేర్పె". ఆమె ఆశీస్సులే మాకు, మాపిల్లలకు రక్ష; జయము.

తుమ్మలవారు ఆమెను గూర్చి వ్రాసిన పద్యములు ("నేను" అను గ్రంథములో కలవు) వారికి ఆమెపట్లగల అనురాగమును, భక్తిని తెలియజేయుచున్నవి.

నెలఁత పెద్దచదువు నేర్వదుగాని, నా
సరణి దిద్దుచదువు చాల నేర్చె
వినయ మార్జవాదు లెనలేని చేవగా
మోచి మోచి నన్ను లోఁచె నబల.

ఈవు శక్తికి మించిన యీవి నేర్చి
తజ్జ! యని జగముకొండాడుఁగాని
వట్టిపిశినారివని దెప్పివైచుఁగద యు
దారతానిధి మత్సతి యన్నపూర్ణ

తన యశమ నా యశమ్మని
మనుగడసాగించు మగువమానిక మిది; నా

కనురక్తయయ్యె నస్మ
జ్జన నాంతర గణ్యపుణ్య సంభారమునన్.

తులసిపూజ దీర్చి, నిలిచి, నిమీలిత
నయనయుగళితోడ నలినమిత్రు
దెసకుఁ గేలుమోడ్చు దేవికి నవశత
నంజలింతు నెడఁద ననుదినమ్ము.

ఈ పద్యములను ఆమెకు చదివివినిపించగా, ఆమె కళ్లలో సంతృప్తి కనిపించినది. అపుడు నాకు తుమ్మలవారు వ్రాసిన "ఆత్మార్పణము" అను కావ్యములోని కపోతి మాటలు గుర్తునకు వచ్చినవి. కపోతము పరోక్షముగా కపోతి గుణగణములను ప్రశంసించెను. అపుడు కపోతి-

"ధన్యనైతిని జగన్మాన్యనైతిని మహా పుణ్యనైతిని సతీగణ్యనైతి
నాథుఁడస్మద్వర్తనంబు నెంతయు మెచ్చి ప్రకటించె నిర్మల ప్రణయగరిమ
మగని నెమ్మదికి నిమ్మాడ్కి నెక్కుటయ కా కులకాంత సతతంబుఁ గోరుచుండు..........

నింక వలసినదేమి నా; కీభవంబు సార్థకతచెందె, దుర్గతిప్రాప్తిదప్పెఁ,
బాపము లడంగె, నోములపంటపండె ననుచు మదిఁబొంగె"...........

తుమ్మలవారు మరణసమయమున - బాబూ! నా పని అయిపోయినదిరా! ఇంక బ్రతకనురా! అమ్మను జాగ్రత్తగా చూసుకోండి! .................. రామ! రామ! "అంటూ తుదిశ్వాసవిడిచినారు.

ఇపుడు మా అమ్మకు 92 సం॥లు . ఆమె హైదరాబాద్ మా సోదరి కల్యాణి గృహము నందు కలదు. మా బావగారు గుంటూరు మురహరిరావుగారు చాలా మంచివారు. తుమ్మల వారి అల్లుడినని వారు చాలా గర్వపడుచుందురు. మాలో మాసోదరి, సోదరుడు డా॥ రఘునాథరాయలు మా అమ్మకు నిరుపమానమైన సపర్యలను చేయుచున్నారు. వారు పసిపిల్లను చూసినట్లు అమ్మను చూసుకొనుచున్నారు. వారికి మిగిలిన సోదరులము కృతజ్ఞత చూపుటయేగాక, చాలా ఋణపడియున్నాము. మా సోదరుడు డా॥. రఘు మానాన్నగారికి కూడ చివరిదశలో నిరుపమానమైన సపర్యలు చేసినాడు. వారిద్దరి సేవలు మరవరానివి. మా సోదరుని చూసినపుడు నాకు తల్లిదండ్రులను కావడిలో కూర్చుండబెట్టి పుణ్యక్షేత్రములు చూపించిన శ్రావణ కుమారుడు గుర్తునకు వచ్చును. ఆ విధముగా తల్లిదండ్రులకు సేవచేయు భాగ్యము లభించుట పిల్లల అదృష్టము. అయితే అటువంటి పిల్లలు నేడు అరుదు కదా!

ఇట్లు,
తుమ్మల శ్రీనివాసమూర్తి



# తుమ్మలవారి అర్ధాంగి అన్నపూర్ణమ్మ

“తన యశము నా యశమ్మని
మనుగడసాగించు మగువమానిక మిది; నా
కనురక్తయయ్యె నస్మ
జ్జననాంతర గణ్యపుణ్య సంభారమునన్” – తుమ్మల

# కృత్యాది

రాష్ట్రసిద్ధికొఱకు రక్తమ్ముగార్చిన
కవిని నేను గాంధికవిని నేను
బడలిబడలి తల్లిబాస కూడెముసేయు
కవిని నేను దేశికవిని నేను.

అల నన్నయ్యకు లేరు, తిక్కనకుఁగా కాంధ్రప్రజానీక హృ
జ్జల జోన్మీలనకృత్ ప్రభాకరవిభాసంకాశ సాధూక్తి మం
జుల పుంభావసరస్వతుల్ గుణగరిష్ఠుల్ భావుకుల్ భక్తు ల
స్ఖలితస్ఫారయశోమహోధవళి తాశాసానువుల్ మాదృశుల్.

నేలవిడిచి సాముసెఱపిన యట్లుండు-సంఘగతికి దవ్వుసాగివ్రాత
యుక్తిచణతగాదు యుగలక్షణము గుబా-ళింపవలయుఁ గావ్యలేఖనమున.

ప్రాఁతదన్నది సర్వంబురోతగాదు-క్రొత్తదన్నది సర్వంబు గుణముగాదు
ప్రాఁతక్రొత్తలలో మేలిరీతులెఱిఁగి-చేయవలయును సాహితీసృష్టి సుకవి.

గిఱిగీచుకొన్నకవి కృతి-చిరకాలము నిల్వ;దెల్లసిద్ధాంతములన్
దరియించి విప్లవముదెస-కరిగినకృతి సత్యదర్శియై రాణించున్.

కళకొఱకేకవిత్వమని గంతులువేయక రోఁతరోఁతగా
వలపులునింపి కబ్బములువ్రాయక విశ్వజనీనబోద్ధృతా
లలిత ముదారవృత్తము కలాకమనీయము సంస్కృతిప్రభా
మిళితమునైన సృష్టి నెదమెచ్చితి జాతికిఁగాన్కలిచ్చితిన్.

ఎవ్వ రెంద ఱెంతదవ్వైన నేను భా-షా విపర్యయమ్ము సైఁపలేను
సాధుశీల మాభిజాత్యమ్ము చెలువమ్ము-ననసి మెఱయువనిత నాదు కవిత.

బాస లోఁతు లంతుపట్టిన ప్రాజ్ఞుఁడే-పాత్రభేదమెఱిగి పల్కఁగలఁడు
కఠిన మృదుల వాఙ్మికాయమెల్లను వాని-యిచ్ఛ ననుసరించి యెడఁదఁగదలు.

భావవిప్లవమ్ము పచరించుకవి శాబ్ద
విప్లవమున కంగవింపఁడేని
గెలువఁడని బిభీషికలుకొట్టువారు నా
సృష్టిఁజూచి యేమి సెప్పఁగలరో!

ఈ మేనెంత నలంగిన
నామనుగడ లోకసేవనమ్మున కిడెదన్
సామాజికకల్యాణము
కామించెద నవ్యభవ్యకవితాసృష్టిన్.

# కర్ణుఁడు

దీక్షన్ బాండవ ధార్తరాష్ట్రులకు సంధింగూర్చి విశ్వప్రజా
రక్షం జేయఁ దలంచి కౌరవసభారంగమ్మునన్ నీతివాగ్
దక్షత్వంబును జూపి శౌరి తనవాదంబెల్ల వమ్మౌట స
ర్వక్షోభంబులు నీకుఁ దప్పవని రారాజున్ దుటారించుచున్.

అరదమునెక్కిపోవుసమయంబున నంబుజనాభువెంట సు
స్థిరతరభక్తిఁ గుంభజనదీసుతముఖ్యులు రా ముకుందుఁ డా
దరమున వారలన్ నిలిపి ధన్యుని గర్ణుని జీరి తేరిపై
సరసను నిల్పి యిట్లనెఁ బ్రసన్నవచోవిభవాభిరాముఁడై

"కర్ణా! నీవఖిలార్థవేదివని పల్కంజెల్లదే యైన నా
కర్ణింపందగు నాదుపల్కు లవి మేల్గావించు భాస్వద్వరో
దీర్ణత్వంబున నీవు పుట్టితివి కుంతీకన్యకుం దొల్లి; సం
పూర్ణ ప్రేమను సూతదంపతులు నిన్ బోషించి రిన్నాళులున్.

ఆకారణమున ని న్నీ
లోకులు సూతుఁగ మనమ్ములో నెంతురు; సు
శ్లోకుండగు కౌంతేయున
కీ కరణిన్ నీచనామమేలా? చెపుమా!

దుష్టాగ్రేసరు ధార్తరాష్ట్ర నిటు లెంతో భక్తిసేవించి నీ
శిష్టత్వంబునకుం గళంకమిడి వాసింబాసి భూభృత్కృపా
దృష్టిం గోరుదువేని ధర్మరతులై దీపించువా రిస్సిరో
కష్టాచారుఁడు భానుసూను వని శంకంబాసి నిందింపరా?

రాజద్భారతసార్వభౌమపదవిన్ రాణించి సర్వక్షమా
రాజస్తోమకిరీట సంఘటిత సద్రత్నప్రభాపుంజ వి
భ్రాజత్పాదుఁడవై సమస్తజన సంభావ్యుండవై వెల్గున
ట్లేఁ జేయించెద నీదు సోదరులచే నేతెమ్ము కుంతీసుతా!

తమ్ములఁగూడి యెంతయు ముదమ్మున భారతసార్వభౌమ పీ
ఠమ్ము నలంకరించి నికటమ్మున ధర్మసుతుండు చామరం
బిమ్ముగవీవ, వాయుసుతుఁ డెల్లినిబట్టఁ, గిరీటి సారథి
త్వమ్మొనరింపఁ, గుబ్జలిరువంకలఁ గొల్వ వెలుంగుటొప్పదే?

అఖిలలక్షణ లక్షితాంగి పాంచాలి ని - న్నాఱవభర్తగా నభిమతించు
నినుఁ గన్నతల్లికుంతీదేవి దీనికై - యెంతేని మదిలోన సంతసించు
నిఖిలబాంధవమిత్ర నివహంబు నీరాక - కనుపమానందంబుననుభవించు
లోకైకశౌర్యు లస్తోకసద్గుణధుర్యు - లగు పాండవేయు లాహా! యటందు

రిందులకు నించుకేనియు సందియంబు - చెందఁ బనిలేదు రాజ్యలక్ష్మీకరాబ్జ
సంగ్రహం బొనరించి శశ్వద్విభూతి - నతులవిఖ్యాతి గాంచవయ్యా! సునీతి!"

అనినం గర్ణుఁడు కృష్ణుఁగాంచి వినయవ్యాపారమేపార ని
ట్లను "దుర్వాసమునీంద్రునింగొలిచి తా నాదిత్యమంత్రంబు నే
ర్చి ననుం గన్నియనాఁడు గొంతి కనెనన్ వృత్తాంతమొక్కింత నే
వినియున్నాఁడ మహాత్మ! సర్వజగతీవిద్యోతితప్రాభవా!

కన్యాత్వంబున కంతరాయ మకటా! కల్గెంగదాయంచు సౌ
జన్యశ్రీనిధి కుంతి చింతపడి వాత్సల్యంబువోనాడి న
న్నన్యాయ్యంబనుచుం దలంపక ప్రవాహంబందు వైవన్ జగ
న్మాన్యుం డత్తఱిఁ దెచ్చె సూతుఁ డనుకంపానిఘ్నచిత్తంబునన్.

అల్లారుముద్దుగాఁ దన
యిల్లాలును దాను బుత్రుఁ డీతండని నన్
జల్లగఁ బెంచెను మేనం
బెల్లుగ మలమూత్రరాశి పెనఁగొనుచుండన్.

కుంతీపుత్రుఁడ క్షత్రవంశజుఁడ నాకు న్మీకు సంబంధ మా
వంతైనంగలదా? యటంచు నను బాల్యంబాదిగాఁబెంచి య
త్యంత ప్రేమముఁజూపువారి నిపు డన్యాయ్యంబుగావీడి ని
శ్చింతన్ బాండవులందుఁ జేరిన జనుల్ "ఛీ" యంచు నిందింపరే?

బద్ధప్రేమ నితండు సూతుఁడనుచుం బాటింప కత్యంత సం
శుద్ధస్వాంతతఁ జేరఁదీసి ధరణీశుంజేసి దుర్యోధనుం
డిద్ధత్వం బొనగూర్చి నన్ సచివుఁగా నేలంగ యుద్ధంబు సం
సిద్ధంబైనతఱిన్ విరుద్ధమతి నిస్సీ! వీడి రాఁజెల్లునే?

ఏను గిరీటి నోర్తునని యెంతయునమ్మికఁ గౌరవేంద్రుఁ డ
ప్పూనిక నాపయిన్నిలిపి పొంగుచునుండు నిరంతరంబు, న
ద్దానిని వమ్ముచేసి దురితంబున కి ప్డొడిగట్టి పాండు భూ
జానికుమారులం గలియుసాహసమెట్లొనరింతు మాధవా!

దుర్వారోద్యమశౌర్యవీర్యవిలసద్దోర్గర్వమేపార గం
ధర్వాదుల్ దివిఁ బాడ సంగరకళాతత్త్వంబు దీపింపఁగా
సర్వోర్వీశులుమెచ్చఁ బార్థుని మహోత్సాహంబునందాఁకి యు
ద్ధోర్విన్ గ్రీడయొనర్పకున్న నగరొక్కో? లోకు లీ కర్ణునిన్

నే నున్నాఁడ నిఁకేమిలోటనుచుఁ దా నిర్భీతిమై నాజికిం
బూనెం గౌరవభర్త పాండవులతోఁ బోటెత్తి;యిప్పట్టునం
దే నేరీతి సుయోధను న్విడుతు? నీ యెగ్గెట్లు సైరింతు? నా
హా! నట్టేటను బుట్టిముంచుపని యార్యశ్రేణి మన్నించునా?

ప్రజకుం దల్లియుఁ దండ్రియున్ గురుఁడు భూపాలుండెకా! వానిపై
నిజభక్తిం బ్రకటించు నెవ్వఁ డతఁడే నిక్కంబుగాఁ బుణ్యుఁ డా
సుజనుండేతగు నిందు నందును సుఖస్తోమంబు నందంగ దా
స జనాధీన! యెటింగి యేపగిది రాజద్రోహముం బూనుదున్.

చతురంభోనిధి మేఖలాఖిల మహీసామ్రాజ్యసింహాసన
స్థితుఁగావించెద రమ్మటందు విపు; డిస్సీ! లజ్జకుంబాసి దు
ర్మతినై స్వార్థమునందుఁజిక్కి యవమారంభంబులంబూని శా
శ్వత దుష్కీర్తిగడింతునా? రవిసుతవ్యాపార మీపాటిదా?

శరదంభోధరచంచలాచపలమీసామ్రాజ్యభోగంబు; కుం
జరకర్ణాంతవిలోలమంగ; మిఁక నాసంవర్తకాలంబు సు
స్థిరమై ప్రస్తవనీయమై విమలమై చెల్వొందు నక్కీర్తి, యిం
దరయన్ దేనిఁ బరిగ్రహింపఁదగుఁ గృష్ణా! యానతీయం గదే!

ఇన్నాళ్ళాతని యుప్పు పప్పు పులు సెంతే మెక్కితిన్; బాస లె
న్నెన్నోచేసితిఁ; "బ్రాణమానములు నీవే నమ్ము" మంచంటి నో
యన్నా! యిత్తటి నక్కురుప్రవరు నన్యాయ్యంబుగా దుఃఖ సం
పన్నుంజేసిన ఘోరదుర్గతులు సంప్రాప్తింపవా? నొంపవా?

అక్షీణంబగు దీక్ష నన్మనిచి విద్యాబుద్ధులం గూర్చి స
ర్వక్షేమంబు లొసంగినట్టి నృపతిన్ వర్జించి దుర్వృత్తి నీ
రక్షఃకృత్య మొనర్తునేని తుదకున్ రాఁబోవు మేలెద్ది? సీ!
భిక్షావృత్తిఁ జరించుటొప్పదె గుణాబ్ధీ! లోకముల్మెచ్చఁగన్.

స్వామిద్రోహమొనర్చి, సర్వధరణీచక్రంబుఁ బాలించి, దు
ర్వ్యామోహంబునుబెంచి, నింద్యమగు పేరార్జించి, జీవింపఁగా
నేమాత్రంబును సమ్మతింప; దనుజారీ! రాజభక్తిప్రియుం
డీ మాన్యుండనఁ బేరుగాంచెదఁ బవిత్రేచ్ఛన్ బ్రవర్తించెదన్.

పాండవధార్తరాష్ట్రులకు భండన మయ్యది తప్పఁబోదు; త
ద్భండనసీమ ధర్మజుఁ డపారజయంబును గాంచి సొరవే
దండ వియద్ధునీగిరిసుతాప్రియ కుందమరాళచంద్రికా
పాండురకీర్తిసంపదల భాసిలు; సందియమేల? మాధవా!

తమ్ముల్ ఋత్విజులై వెలుంగఁగ నుపద్రష్టృత్వముందాల్చి హ
ర్షమ్ముం జూపుచు నీవునిల్వ, దృఢదీక్షాకంకణంబూని తే
జ మ్మేపారఁగ ధార్తరాష్ట్రపశుహింసన్ భీమ సంగ్రామ యా
గమ్ముం జేయును ధర్మపుత్రుఁడు జగత్కల్యాణసంధాతయై.

భాసురపుణ్యమూర్తులగు పాండుకుమారులుగాక దూషితా
భ్యాసులు కౌరవుల్ రణమునందు జయింతురె? ధర్మమెచ్చటన్

వాసిగనుండు నచ్చట ధ్రువంబు జయం బనరొక్కొ! పండితా
గ్రేసరులైనవారు నృహరీ! పెఱమాటలు వేయునేటికిన్?

ఎన్నఁడొ కన్నెఱికంబున
నన్నుంగని గొంతి విడిచె నదిఁ; బాండవు లీ
యన్నమొగం బెఱుఁగరు; "మీ
యన్నయ్య" నటంచు నిప్ప డనిన న్నగరే?

సదమల ధర్మమూర్తియు నజాతవిరోధియునైన ధర్మజుం
డిది। వినునేని రాజ్య మతఁ డేల గ్రహించును నా కొసంగ క
య్యది తగునే? మహామహుఁ డనంతగుణాఢ్యుఁ డతండు సత్యసం
పద లలరార లోకపరిపాలన సేయక యుండు టొప్పనే!

కరుణాపూరితమైన చిత్తమున మత్కల్యాణముంగోరి యి
త్తఱి నీ వాడిన మాటలన్వినక యీదాసుండు మాఱాడె నే
వెరవుం దోఁపమి; దీని కల్గకు, ననున్ వెన్నాడి నీచక్రియా
చరణాసక్తునిగా నొనర్పకు, నమస్కారంబిదే మాధవా!

ఇంక నొకమేలు సేయుమో పంకజాక్ష!
యుష్మదస్మత్త్వసంగంబు నొక్కమాట
నైన నొరులకుఁ జాటక మానసంబు
నంద నిలుపుము పరమరహస్య మగుట

సెలవు నొసంగవయ్య యదుశేఖర! నేనిఁకఁ బోయివత్తు నన్
దలఁపున నిల్పవయ్య భయదంబగు సంగరసాగరంబు ను
జ్వల భుజశౌర్యనౌక నిరపాయగతిన్ దరియించి నిన్ను న
వ్వలఁ గనుఁగొందుఁ; గానియెడ స్వర్గమునం గనుఁగొందు మాధవా!"

అకలంకరాజభక్తిం
బ్రకటించుచుఁ గర్ణుఁ డిట్లు పలికిన విని, నం
దకుమారుఁ డద్భుతానం
ద। కీర్ణహృదయంబుతోడఁ దా నిట్లనియెన్.

"బళి! బళి! మెచ్చితిం గమలబంధుకుమార! యుదార! నీ సము
జ్జ్వల హృదయంబెఱుంగ నిటుపల్కితి, నల్కవహింపకయ్య, నీ
విలసితవృత్తమున్గని వివేకు లహో! యనకుందురయ్య, ని
ర్మల నిరవద్యకీర్తి నసమానుఁడవై మనవయ్య ధీనిధీ!"

అని కర్ణుమెచ్చి కృష్ణుం
డనఘు నతని వీడుకొల్పి యర్కజుచరితం
బున కెద నబ్రంపడుచున్
జనెఁ బాండవులున్న యెడకు సరభసగతితోన్.

**శబల - 10-12-1926**

# నిరాశ

భారతసార్వభౌమపదభాసురుఁ డొక్కదినాన శంతను
క్ష్మారమణుండు వేఁట తమకంబున నయ్యమునాతరంగిణీ
తీర భయంకరాటవులఁ ద్రిమ్మరుచున్ జనకంటకంబులన్
గ్రూరమృగంబులన్ గడిమిఁ గూల్చుచునుండెఁ బ్రచండమూర్తియై.

అయ్యవసరంబున -

మృగమదఘనసారా। మరు
జ్జగతీసుమసౌరభములఁ దలఁదన్నుచు నిం
పగుతావి గుబులుకొనఁ దా
నిఁ గడున్ ధరణీశ్వరుండు నెమ్మది మెచ్చెన్.

మెచ్చి యెచ్చటనుండి తా వచ్చె నీ య
పూర్వసౌరభ్యమనుచు నబ్బురముగాంచి,
వేఁట చాలించి, యాతావి వీచునట్టి
దెసకుఁ బయనించె మూలంబు తెలియనెంచి.

చని శంతనుఁ డంతం గను
గొనె యమునం బడవ నడుపు కోమలిఁ గన్యా
మణి సౌందర్యనిధిని యో
జనగంధిఁ దటిల్లతాంగి సౌజన్యఖనిన్

అంతట యింతిసౌరభము నారసి యంటినఁ గందుమేని। సొం
పెంతయు నిండగాఁ బొగడి యింపగు। నాచిరునవ్వు పొంకమున్
జింతనఁజేసి కన్నుఁగవచెల్వము వేమఱు నుగ్గడించి భూ
కాంతుఁ డనంతరాగమునఁ గన్నియపై మదినిల్పి యిట్లనున్.

ఎవ్వతె? వెవ్వనికూఁతుర?
వెవ్వంశము? నామధేయమెయ్యది? తరుణీ!
మవ్వంబగు నీదగు లే
జవ్వన మిటు లేటిపాలు సలుపం దగునే?

అనిన నయ్యింతి సకలలక్షణసమేతు
శంతనునిఁ జూచి వదనాంబుజాతసీమ
లేనగవుఁ జిఱులజ్జయు లీలవెలయ
మందమందమృదూక్తి నిమ్మాడ్కిఁబలికె.

ఆర్య! వసుక్ష్మాపాలక
వీర్యంబునఁ బుట్టి, దాశవిభుఁ డెంతయు నౌ
దార్యంబునఁ బెంపఁగ, ని
క్కార్యం బొనరింతు నాన్నగారి యనుజ్ఞన్.

**కథాకవిత్వము**

జననాథ! సత్యవతి నాఁ
దనరెద, మాతండ్రి యేటిదరినొప్పెడు నా
జనపదమున యందుం గలఁ
డని। తన వృత్తాంతమెల్ల నంగన వినిచెన్.

అత్తరుణిపల్కులన్ విని
యుత్తమవీర్యప్రసూత యోహెూ! యిది యం
చత్తినరాగము తాల్మిని
తుత్తునియలుసేయ నృపతి తొందరపడియున్

ధీరుండుగాన మదన వి
కారము లోలోన నడఁచి "కైవర్తవిభుం
జేరి మిటారిపయింగల
కోరికి నెఱిఁగించు టొప్పగు" నటం చెంచెన్.

ఎంచి యమ్మించుబోఁడినిగాంచి "పాంథు
ననుఁ దరింపఁగఁ జేయుమో నాతి" యనిన
నబల చిఱునవ్వు నవ్వి "రం" డనుచు నతని
నద్దరికిఁ జేర్చెఁ దన నావయందు నిలిపి.

భూనాథుఁ డంత సత్యవ
తీ నవలావణ్యమును మదిం జూచుచుఁ బ్ర
జ్ఞానిధి నప్పల్లెదొరం
గానఁగఁ జనె వానియింటికడకుం గడఁకన్

తత్తఱపాటుతోడ భరతప్రభుఁ గన్గొని దాశరాజు తా
నత్తఱి యోగ్యసత్క్రియల నవ్విభునిం బరితుష్టఁజేసి య
త్యుత్తమమైన పీఠమున నొప్పగ నిల్పి యనల్ప సమ్మదా
యత్త మనంబుతోడ వినయంబు నయం బెసలార నిట్లనెన్

అర్కసమానతేజ! భవదాగమనం బది యెంతయున్ శుభో
దర్కము గాదె?మీ చరణతామరసామలరేణురాజి సం
పర్కము చేత మద్గృహము పావనమౌ టది యెంతవింత? యే
తర్కము కల్గు? నాభవము ధన్యతఁ జెందెనటంచుఁ బల్కినన్.

"ఊరకరారు మహాత్ము ల
కారణముగ" ననుచు నండ్రుగావున నుడువం
గోరెద నీయధమునికడ
కీ రరుదేరంగ హేతువెయ్యది? నృపతీ!

మనుజేశ్వర! భవదర్థం
బొనరింపం దగిన కార్యముండిన దానిం

దన యోపినంతవఱకుం
బొనరింపంగలఁ డితండు పూర్ణాసక్తిన్.

అన జననాథుఁ డిట్టులనె నల్లన నవ్వుచు "దాశరాజ! నీ
కనయము సేమమే కద! మదాత్మకు నెంతయు మోదమయ్యె నీ
వినయము నీవివేకమును విశ్రుతమౌ మరియాదనుం గనుం
గొన నుచితజ్ఞులుండుకొఱకుం గులభేదమొకండు కల్గనే?

పొలకుఁ డీతం డనుచున్,
బాలితుఁడను నే నటంచు భావించెద వి
ట్లేలా భయంబు? నీవుం
బాలకుఁడవు గావె యిచటిపల్లెలకెల్లన్.

రాచఱికమున్నవాఁడవు
నీచుండవు గావటంచు నెమ్మదియం దా
లోచించియ చనుదెంచితి
నీ చుట్టఱికంబుఁగోరి నేఁ డియ్యెడకున్.

చందనగంధి సత్యవతిఁ చక్కదనంబునుజూచి పెండ్లియా
డం దలపోసి తండ్రివగుట న్నినుఁగోరుట పాడియంచు నా
సుందరితో మదాశయము సుంతయుఁ జెప్పక వచ్చినాఁడ నీ
మందిరసీమ కో! సుగుణమండన! నన్నెటులాదరించెదో!

మహితభారతసామ్రాజ్యమాననీయ
సింహపీఠోపవిష్టయై చెలఁగునట్టి
భాగ్యమునకంటె నీముద్దుపట్టి కింక
వలయుసౌభాగ్యమెద్ది? కైవర్తరాజ!"

అనిన నతం డిట్లనియె -

"ధన్యుఁడనైతి మత్సుతను దాము వరించుటఁజేసిఁ యో! జగ
న్మాన్యచరిత్ర! యుష్మదసమానదయాపరిలబ్ధి నూత్నచై
తన్యముఁగల్గి మత్కులము దానతిపావనమై వెలింగె సా
మాన్యమె నీదు బాంధవము మాకు లభించుట రాజసత్తమా!

"గొనములకొటారు చక్కం
దనమునకుం బట్టుఁగొమ్మ తరుణీమణి నీ
కనుకూలమైన కన్నియ"
యని వేఱ వచింపవలయునా సత్యవతిన్

శీలము వంశగౌరవము చిత్తమెలర్చెడిసోయగంబు ల
క్ష్మీలలనాకటాక్షము ప్రసిద్ధివహించినబంధుమిత్రు లు
ద్వేల యశంబు ప్రాయము వివేకము గల్గిన యట్టివానికిన్
బాలిక నిచ్చు టర్హమని పల్కుచునుంద్రు గదయ్య ధీనిధుల్.

కావున మీ కిచ్చుటకై
భావంబున సంశయింపఁ బనియేమి ధరి
త్రీ వల్లభ! మ త్తనయన్
"శ్రీ వచ్చిన కాలనడ్డు" చెనటులు గలరే!"

అని దురాశాగ్రహంబు త న్నావరింప
"నృపుఁడు కామాతురుం డౌట నిప్పడెంత
కైన వెనుదీయఁబోఁ డిదే యద" నటంచు
వరమొకం డిచ్చగించి భూవరున కనియె.

"అకలంకచరిత! మత్పు
త్రిక నీకు నొసంగుటకు మదిన్ సందియ మిం
చుక లేదు గాని నాకిపుఁ
డొక కోరికి కలదు దాని కొడఁబడవలయున్."

అని యనుచితంబు గానన్
దన తలఁపుం దెలుప వెఱచు నాతని గని "నీ
కనుమానమేల? వీలై
నను దీర్చెద నొడువు" మంచు నరపతి యనినన్

"భూపవతంస! నీవలనఁ బుణ్యచరిత్రకు మత్కుమారికిన్
రే పుదయించు నందనుఁ డరిందముఁ డౌతఁ డఖండభారత
క్ష్మాపతి నీ పరోక్షమునఁ గావలెనంచుఁ దలంచినాఁడ నీ
వీ పని కియ్యకొన్న నిపుడే నడపింతు వివాహతంత్రమున్.

"ఇదియ మదీప్స" మటంచుం
గొదుకక దాశుండు వల్క ఘోరవరం బ
య్యది నృపునకుఁ బిడు గడఁచిన
విధమైన నతండు మిగుల విహ్వలుఁ డయ్యెన్.

అంత శంతనుండు నిజాంతర్గతంబున

"కటకట! కైవర్తవిభుం
డెటువంటి వరంబుఁగోరె నిది యెంతయు దు
ర్ఘటము గదా!" యంచుఁ దలఁచి
కుటిలాలకమీఁది కోర్కి కొనలిడు కతనన్.

"ఇది యసాధ్యమగుట నిం కెద్దియైనఁ గో
రం గదయ్య దాశరాజ!" యనిన
బిఱ్ఱబిగిసి యతఁడు "పృథివీశ! నా కొండు
తలఁపు లే దటంచుఁ" దా వచించె,

అంతట శంతనుం డిఁక రవంతయు లాభము లేదటం "చిసీ!
కాంతల పొందుఁగోరి కలకాలము మాయనిదుర్యశంబు నా

ర్జింతునె? రూపసాహససుశీలనయాదిగుణప్రసిద్ధు వి
క్రాంత వినీతు నగ్రసుతు రాజ్యవిదూరు నొనర్ప పాడియే!

ముద్దియ మీఁదిమోహమున ముందునువెన్కయుఁ జూడఁబోక నా
పెద్దకుమారునిన్ విడిచి పిన్నకుఁ బట్టము గట్టినన్ జనుల్
తద్దయుఁ గీర్తిగన్న హిమధామకులప్రథ రూపుమాపు నీ
మొద్దని బ్రువ్వఁదిట్టరొకొ? మూర్ఖుఁడనై యిటుసేయుటొప్పనే!"

అని వితర్కించి -

లోకాపవాదభీతియు
నాకన్నియమీఁదివలఁపు నంతంతకు న
ఱ్ఱాఁకలఁబెట్టఁగ హృదయ
వ్యాకులమేపార నాతఁ డలిగెన్ బురికిన్.

**దివ్యజ్యోతి - జనవరి-1928.**

## వీర ధర్మము

(బాలచంద్రుఁడు రణ మొనర్పఁబోవుతలంపు వెలువరించినతఱిఁ దల్లియగు నైతాంబ)

అక్కట కుమార!నీ కెవ
రిక్కరణిన్ బోధచేసి రీ వెక్కడఁ? బో
రెక్కడఁ? బౌరుష మెక్కడఁ?
జెక్కిలి నిటు మీటఁ బాలుచిందెడి నీకున్

బంతులాటగాదు బలిచెడుగుడుగాదు
బొంగరాల విసరుభంగి గాదు
గోలిగుండ్ల నాడికొనుఫక్కిగాదు సం
గరము తగరుపోరు కాదు తనయ!

హుంకారము లతులధను
ష్టంకారము లార్భటులును జంకెనలును బల్
బింకెలుఁ బొంపిరివోయెడు
సంకులసమరోర్వి నిల్వఁజాలుదె తండ్రీ!

మదగజ ఘీంకృతుల్ తురగమండలిహేషలు భేరిభాంకృతుల్
రథగణనేమిధంధణ లరాళకరాళకృపాణజంఝళల్
గుదిగొను సింహనాదము లకుంఠితభంగిఁ జెలంగ సాధ్వసా
స్పదమగు యుద్ధరంగమున బాలుఁడ వీ వెటు నిల్తు సెప్పమా!

కత్తుల తళతళలకు నీ
చిత్తము కంపింపఁ గనులఁ జీఁకటిక్రమ్మన్
దత్తఱపడువడిఁ బగ యొక
మొత్తమ్మై ముట్ట నెట్లు మొత్తెదు వారిన్.

యుద్ధము లొనర్చి దేశంబు నుద్ధరించి
జాతికిం గులమునకు విఖ్యాతి దెచ్చి
మమ్ము నలరింప భావికాలమ్ము లేదె?
తరుణమిదిగాదు మాను మీతలఁపు గుఱ్ఱ!

సంతతిలేక కడుంగడుఁ
జింతిలిచింతిల్లి చిట్టచివరకుఁ జెన్నుం
డింత దయ సూప నిన్గని
సంతసపడితిన్ ఫలించె జన్మం బనుచున్.

నానిధానంబ వీవు నాప్రాణ మీవు
నన్ను నెడఁబాసి పోయెదే నాయ మెడసి
తగవుగా దీప్రయాణంబు తగదు తగదు
విడువు సంగ్రామవాంఛ నో! వెడఁగుఁగుఱ్ఱ!

నీతండ్రి రణోర్వికిఁ జన
నాతో డీ వుందు వనుచు నమ్మితి నెదలో
నోతండ్రి! నాకడుపునం
దీతటిఁ జిచ్చిడకు మేటి కీ సాహసముల్.

ఆలింపుము నాపల్కులఁ
జాలింపు మపాయజనక సంగరయాత్రన్
దూలింపుము రోషం బన
బాలుం డిటు లనియె ధర్మపరవశుఁ డగుచున్.

వెఱఁగయ్యె నీదుపల్కుల
తెఱఁగుం బరికింపఁ దెల్గుఁదెఱవకు నెఱపో
టరియగు బ్రహ్మనపత్నికిఁ
బిఱికితనం బిట్లు వెల్లివిరియందగునే!

బాలుఁడవంచు సంగరముభంగు లెఱుంగనివాఁడవంచు గు
ఱ్ఱా లిగిలించినంతనె కరంబు భయంపడెదంచు నా కహో!
పోలనినీతులం గఱపఁబోకుము వైరివిదారణక్రియో
ద్వేల యశస్కుఁడౌ వెలమవీరశిఖామణి వీఁ డెఱుంగుమా!

బాలుఁడుగాఁ డితండు యువపట్టము నేలెడుదిట్ట యౌవన
శ్రీలలితుండె సత్క్రియలఁ జేయ వలంతి యతండె దుస్థితిన్
దీలుపడంగఁ దోలి నిజదేశసముద్ధరణం బొనర్పఁగాఁ
జాలినమేటి వాఁడె పటుసాహసదోహలుఁ డూహసేయఁగన్.

కొండలఁ బిండియొనర్చెద
దండధరుండన విరోధిదళముల నెల్లన్

జెండాడెద వ్రేల్మిడి బ్ర
హ్మాండంబులఁ బట్టి బంతు లాడెద జననీ!

కారెమపూఁడి రంగమునఁ గయ్యముసల్పఁగఁ గాలుదువ్వుచు
న్నారు తెలుంగుజోదు లదనన్ గదనంబున దూఁకి మూఁకలో
వీరవిహారము ల్సలిపి విశ్రుతకీర్తి గడింపకున్న నా
పేరును బెంపు సొంపు చెడఁ బెద్దలుఁబిన్నలుఁ బ్రువ్వఁదిట్టరే!

జనకుం డాహవభారము న్నిజభుజస్కంధంబునం దాల్చి తీ
అనికష్టంబులఁజిక్కి స్రుక్కుతటి ధైర్యస్థైర్యవిభ్రాజియౌ
తనయుం డెవ్వఁడు రాణివాసములఁ జింతంబాసి వర్తించు నో
జననీ! వేగ ననుజ్ఞ యిమ్ము సమరోత్సాహంబు తీండ్రించెడిన్.

ఆహవమున కిప్పడ చని
దోహలమునఁ గసిమసంగి దుష్టవిరోధి
వ్యూహంబులఁ ద్రుంచెద నా
బాహాబలమెల్లఁ దేటపడుచందమునన్.

తెలుఁగుందేశచరిత్రకుఁ
జెలువిచ్చి సువర్ణవర్ణచిత్రితములు నై
పలునాఁటివీరగాథలు
విలసిల్ల నొనర్తు నారవిసుధాకరమున్.

గత్యంతరంబు సెప్పకు
మత్యంతోత్సాహమలర నాజి “యశోవా
మృత్యుర్వా” యని దూఁకెద
నిత్యంబగు నసము దెసల నింపెదఁ దల్లీ!

వెలమలు కమ్మవీరు లలవిప్రకుమారులు రెడ్డిజోదులుం
దెలఁగలు దేశదాస్యమును ద్రెంప విరోధిశిరోధిఖండనో
జ్జ్వలకరవాలహస్తులయి సంగరలక్ష్మి నలంకరింప నన్
నిలుపఁదలంచె దిందు జననీ! నిను నే మనువాఁడఁ జెప్పమా!

స్వార్థనిరతుండు తుచ్ఛభోగాభిరతుఁడు
పాఱుఁబోతు దేశద్రోహి బైసిమాలి
మూలడాఁగిన డాఁగుఁగా; కాలమునకు
దూఁక కెవఁ డుండు నిత్తటివీఁకతోడ.

నీ వెఱుఁగని ధర్మంబులు
లే వైనను బుత్రమోహలీనాత్మకవై
యీవిధిఁ బల్కెదు, తమముం
బోవిడువం దగిన యదను పొమ్మిది తల్లీ!

**కథాకవిత్వము**

పుత్రు(డ మిత్రు(డనియు( గళత్రమనియు
భర్తయని సోదరుండని బాంధవు(డని
బాలు(డని వృద్ధని తలంచువేళ గాదు
తల్లిరో! సాగుచుండె స్వాతంత్ర్యరణము.

కరికర్ణాంతవిలోలము
శరీరము; తడిత్సమంబు సకలార్థంబున్;
సరసీరుహదళగత శీ
కరములు భోగములు; వీన( గాంక్షలు దగునే!

కాయం బనపాయము గా
దో! యమ్మరో! కీర్తిమాత్రముండును గవిరాడ్
గేయంబై యాచంద్ర
చ్ఛాయానాయకము దశదిశావ్యాప్తంబై.

వీట నున్నను గాటంపు(గాట నున్న
మిత్తి నెదిరింప నెవనికి సత్తి గలదు.
ఉప్పతిల్లుచు( జెల్లుచు నుండు(గాని
యెల్లప్రొద్దులు నొక్క మే నెట్లు నిలుచు.

బ్రదికిన( నాల్గుదినంబులు
నదిరా! యని జగము మెచ్చునటు పౌరషసం
పద పొంపిరివోవ(గ నుం
డ(దగు న్నరు( డంచు బుధ లన న్వినవొక్కో!

"ఆరయ వివృతస్వర్గ
ద్వారము రాజులకు నాహవం" బంచు మహో
దారు(డు శాంతనవు(డు తా
భారతసంగ్రామవేళ భాషింప(డొకో!

అమ్మరో! వీరసింహముల కాహవరంగ మొకండె వాసయో
గ్యమ్మగు కాననం బచట( గాయము( బాసిన( బాయకున్న సౌ
ఖ్యమ్మున కించుకంతయును గల్గదు లో టటకేగలేని ద
ద్ధమ్మలు భుక్తిముక్తులకు( దప్పదురం చనరొక్కొ పండితుల్!

తను వస్థిరంబుగావున
మనుజుం డనయంబు నప్రమత్తత తోడం
బొనరింపం దగు మృత్యువ
దనసదనావాసి వోలె( దనధర్మంబున్.

ఉత్తమమగు నరజన్మం
బెత్తిన ఫలమేమి? సుగతి కేగెడుమార్గం

బెత్తోయంబునఁ గానక
మత్తిల్లి చరించునతఁడు మాతరొ చెపుమా!

మాతృదేశం బన్యమనుజేశ్వరునిచేతఁ - జిక్కి స్వాతంత్ర్యంబు దక్కి తనదు
జాతీయతను బాసి చేతోగతంబైన - తలపు వెలువరింపఁ దగినహక్కు
నెడసి లోలోపలనే క్రుళ్లి కుములుచు - నీచదాస్యమున మునింగి పిఱికి
తనము వరించి నితాంతకష్టపరంప - రల నీఁగి దారిద్ర్య మలమ దిక్కు
లేక శోకించువేళఁ దల్లిమొఱ నాల - కించి మై పులకింపఁ జలించి కొంచె
మేని నామెకుఁ దోడ్పడలేనిబిడ్డ - బ్రతు కదేటికి ధాత్రికి బరువుచేటు.

**పఱిగపంట -1-10-1930**

**(ఉప్పు సత్యాగ్రహ సమయము)**

# సేవా ధర్మము

(మహాకవి కాళిదాసు ననుసరించి)

చక్రవర్తి దిలీపుఁడు వసిష్ఠుం జేరి తన యనపత్యతకు (సంతానము లేకపోవుటకు)
వగవ, నా ఋషీంద్రుఁ డతని నోదార్చి "నా హెూమ ధేనువును నందినిని బూజింపు
-మదియ నీ యాప్సితంబు నొసంగు"- ననవుడు మహీపాలుఁడా మొదవును (ఆవు)
భక్తిమై సేవింపఁజాగె - నొక్కనాఁ డా గిడ్డి (ఆవు) నడవికిఁ దోలు కొనిపోయిన -

మనుజవిభుండు దుష్టమృగమండలి కాఁబసినీడ నేనియుం
జెనకుట దుశ్శకం బనుచుఁ జిత్తమునం దలపోసి చెంగటం
దనరు మహీధ్రమౌళి సముదంచితశోభలు కాంచువేళ నే
పునఁ జనుదెంచి పై దుమికి బోరన నీడ్చె మృగేంద్ర మగ్గవిన్.

గుహలు మాఱుసెలఁగ గో వప్పు డఱచిన
యార్పు దీనబంధు వగు నృపాలు
శైలసక్త దృష్టి సరగ మరల్చెఁ బ
గ్గాలఁ బట్టి యీడ్చు కరణి తోఁప.

ధాతుమయమైన కొండనెత్తమ్ము నందుఁ
బూచి యేఁచిన లొద్దుగు పోల్కినెఱ్ఱఁ
దనము నెగఁజిమ్ము కుఱ్ఱిపైఁ దాండవించు
తెల్లమెకమును గాంచె నవ్విల్లు దాల్పు.

అంత మృగేంద్రగామియు, జితారియు, నార్తశరణ్యుఁడైన భూ
కాంతుఁడు స్వప్రమాదమునఁ గల్గిన చెట్టకు సిగ్గుచెంది దు
స్వాంతము వధ్యమైన మృగవల్లభముం దెగటార్చఁగా౹ నిషం
గాంతర శస్త్రమున్ దివియ నాసపడె న్గడు నల్క తొల్కఁగన్.

చిత్తరువు నందు దిద్దితీర్చిన విధానఁ
గదలదయ్యెఁ నవ్వీరుని కరము నఖర

కాంతినికరపరిచ్ఛన్న కంకపత్ర
శరశిరోబాంధవత్యాగసహముగాక.

తన కరం బట్లు మ్రోడువాఱిన వివృద్ధ
రోషుఁ డా రాజు మాంత్రికరుద్ధవీర్య
భోగియై చెంతఁగల మార్తుఁ బొదువలేని
తన ప్రతాపమ్ముచే లోనఁ దగులఁబడియె.

తన యున్కికి వెఱఁగందెడు
మనుకులమణి సింహసత్త్వ మాన్యుని గని యి
ట్లనెఁ గేసరి నరభాషల
జనపాలుఁ డవేలచిత్రచకితుఁడు గాఁగన్.

ఏల వృథాశ్రమించెదు నరేశ్వర! నీ విశిఖంబు వచ్చియున్
జాలదు నన్నుఁగూల్ప, నిది సత్యమ, యంబరచుంబిపాద పో
న్మూలన కౌశలమ్మునకు నోఁచిన మారుతుఁ డెంత నిక్కినన్.
శైలమునూఁపునా విమతసార మెఱుంగక విక్రమింతువా!

శివుఁడు రజతాచలంబు నాఁ జెలఁగు నాము
టెద్దు నెక్కుచుఁ బాదంబు నింత మోపి
దయఁ బవిత్ర మొనర్చు నీ దాసునడుము
నధిప! నన్నుఁ గుంభోదరుఁ డండ్రు జనులు.

శివుఁడు ముద్దుసేయు చిన్నారిపాప యీ
దేవదారు; వభవుదేవి దీనిఁ
బెనిచె మేల్మిపసిఁడిబిందెల తోడఁ దె
చ్చిన పయస్సు వోసి చిన్ననాఁడు.

చెక్కిటి తీఁట నడంపఁగ
నొక్క వనేభంబు రుద్దె నొకపరి దీనిన్
రక్కసిముల్కులఁజిక్కిన
యక్కొమరుంగూర్చివోలె నపు డుమ వగచెన్.

అది మొద లోనృపాల! వనహస్తి భయంపడ నన్ను సింగపుం
గొదమనుజేసి యీ తుహిన గోత్రగుహాగృహవాస మిచ్చి నన్
గదిసెడి సత్త్వకోటి నెరగా నియమించెఁ బినాకపాణి, య
మ్ముదలఁ దలన్ ధరించి సతము న్నెఱవేర్తు మదీయధర్మమున్.

శంభు నిర్దిష్ట భోజనసమయ మగుచు
నాకుఁ జిక్కిన యీ కుత్తి నల్లఁజేసి
క్షుధితుఁడగు రాహు వైందవసుధనుబోలెఁ
దనివిసెందెద నేఁడు గోత్రాకళత్ర!

శస్త్రసాధ్యంబుగాని రక్ష్యమును విడువఁ
దలఁగిపోవునొకో ధనుర్ధరుల కీర్తి
యోపిన కొలంది గురుభక్తి చూపినట్టి
నీకు సిగ్గేల యిఁకఁ బొమ్ము నెలవు సేర.

మృగరాజిట్లు వచించిన
ప్రగల్భవాక్యములు విని నృపాలుండు నిజా
శుగ మిట్లడఁగుట శివు చే
తఁ గదా! యని విడిచె నాత్మఁ దగిలిన లీఢన్.

అతఁడు బాణప్రయోగభగ్నాది మప్ర
యత్నుఁడై కులిశంబు నేయం గడంగి
నాఁడు ముక్కంటిచూపుచే మ్రోడువాఱు
నింద్రు బలె నిల్చి కేసరి నిట్లు పలికె.

సింగమ! విను మిబ్భంగిని
భంగంపడినట్టి యేను బల్కెడి నుడి। న
వ్వంగఁ దగినదియ; యైనఁ బ
రేంగిత మీ వెఱుఁగుదానవే యని వినుతున్.

జగములెల్ల నేలు చంద్రమశ్చూడుఁ డో
యన్న! నాకుఁ బూజ్యుఁడగును గాని
యాహితాగ్ని గురుని యావిట్లు త్రుంగుచు
నెదుటనుంట సూచి యెట్లుసైఁతు.

అట్లగుట నీవు నాదేహమారగించి
యాఁకటిం బాపికొమ్ము సాయంతనమున
కమ్మకొఱకు నంబా!యనియఱచులేఁగఁ
దలఁచి వీడుమబుషికులోత్తముని సురభి.
ఒడయని యీ పల్కులు విని,
పడకులచీకటులు తొలఁగఁబాఱ న్నగి, య
వ్వెడఁదమొగంపు। మెకం బీ
వడువున వాక్రుచ్చె నవనివల్లభు తోడన్

ఎదురుగొడుగులేని యేలికతనమును,
గ్రొత్తజవ్వనంబు గొనబుమేని
నల్పమైన లాభ మాసించి విడిచెద
వెంత మూఢబుద్ధి వీవు నృపతి!

భూతదయ నీకుఁగలదేని జేతమందు
నరయు మీపల్కు; నీవు మైఁదొరఁగ, నొక్క

మొదవె జీవించు, నటుగాక బ్రదుకుదేని,
జనకు వలె నెల్లప్రాణుల సాఁక నోర్తు

గురుఁడు శిఖితుల్కుఁ డతని కొక్కండె మొదవు,
దాని విడిచిన, నతని శాపానఁ బడుదు
నంచు వెఱచెదె, తద్రోష మార్పు పొంటె
నీకు మందలు లేవె దుగ్ధాకరములు.

అట్లగుట నెల్లశుభముల ననుభవించు
నీ బలిష్ఠశరీరంబు నిలిపికొమ్ము
మనుజనాథ! భూస్పర్శనమాత్రభిన్న
శాతమన్యవపదము రాజ్యం బనంగ.

సింగ మిటుపల్కి విరమింప శీతగిరియు
జనవరేణ్యున కట్ల యుచ్చైస్స్వనమునఁ
జెప్పెనో యనఁ గందరాసీమవలన
మూరిఁబోవుచు వెల్వడె మాఱుమ్రోఁత.

శివకింకరుఁ డిట్లన, మా
నవనాథుఁడు, భీతలోచనమ్ములతోఁ, ద
న్నవలోకించెడి గురు ధే
నువుపైఁ గడు జాలి నొంది, నుడివె న్మృగుడన్.

క్షత్రపదమ్ము గదా మద్
గోత్రమ్మున పేరు; దీని గుట్టెఱిఁగియు నా
వీ త్రోవ నుండ విడిచి ధ
రిత్రీ రాజ్యంబు నెటు వరింతు మృగేంద్రా!

లాఁతిమొదవుల నొసఁగి యేరీతిఁ దబిసి
మంట చల్లార్తు నిది వేల్పుదంట గిడ్డి
కంటె వెల్తిదిగాదు ముక్కంటి కరుణ
యుంట నీ తొడుకుం బట్టుకొంటి వీవు.

నా యొడలి న్బలగా నిడి
యీ యావుం బ్రోచు టొప్పు నిటు లొనరింపన్
నీ యశనార్తిచను న్ముని
రాయని హొమాదివిధుల రాయిడి తొలఁగున్.

రక్షమును మిత్తికిడి శరీరంబు గాయ
పడని సేవకుఁ డెటు నిల్చుఁ బ్రభువు నెదుట
నీవు నొకయయ్య కడఁ గొల్వు నెఱపవోటు
లేదె నీకును నా కావులీల మ్రాఁకు.

ఏ నవధ్యుఁడ నని యెంతువేని మ ద్వ
శోంగరక్షణ సేయు మీ యంగ మంది
బుద్బుదప్రాయమును బంచభూతమయము
నైన మేనిపై మముబోఁటు లాసపడరు.

మాటలాడికొంట మైత్రికి మూల, మా
మైత్రి పాదుకొనియె మనకు నిచటఁ,
గాన మిత్రుకోరికను జిన్నపుచ్చుట
నీకుఁ దగదు భూతనేతృదాస!

అనుడు నుప్పొంగి విడిచె సింహంబు కుక్షి
నపుడ నృపబాహునిర్బంధమడఁగె-నంత
ముక్తశస్త్రుఁడు నిజదేహమును మృగేంద్ర
మున కొసఁగె రాజు మాంసంపుముద్దఁబోలె.

అపుడధోముఖుఁడై నరేంద్రాగ్రసరుఁడు
ఘోరసింహనిపాతమ్ము కొఱకు నెదురు
సూచుచుండఁగ నతనిపై నేచి కురిసె
నమరహస్త విముక్త లతాంతవృష్టి

అంత లేవఁగదోయి వత్సా! యటంచు
నమృతమయి వాణి చెవిసోఁక నవనిభర్త
లేచి పాల్చేపి తన తల్లిలీల నున్న
సురభిఁగనె మ్రోల సింగంబు సురిఁగిపోయె.

ఎంతయు నబ్బురంపడు నరేంద్రున కిట్టులు పల్కు గోవు నీ
స్వాంత మెఱుంగ సాధుజనసత్తమ! సింగమనైతి నేన న
న్నంతకుఁడేని డాయ భయమందు ఋషీంద్రునిశక్తి నేన నిం
కెంత తదన్యఘాతుకము; లించుక నీవ తలంచి చూడుమా!

నీ దయకును, గురుభక్తికి,
నా దగు హృది పల్లవించినది, దుగ్ధంబే
కా దెట్టికోర్కి నేనియు
నీఁదగుదుఁ బ్రసన్ననైన నేను గుమారా!

పదపడి మానితార్థి నిజబాహుసమార్జిత వీరశబ్దుఁడై
పొదలిన యవ్విభుండు కరము ల్ముకుళించి కులాభివర్ధనున్
సదమల నిత్యకీర్తి విలసచ్చరితున్ సుతు నిమ్మటంచు న
మ్మొదవును వేఁడె నేఁడు వ్రతముల్ ఫలియించె నటంచు నుబ్బుచున్.

మెచ్చితిఁ గుమార! నీ వర
మిచ్చితి నని పల్కి; ధేను విదె త్రావుము నా

వెచ్చని పాలని మేలని
సచ్చరితున కానతిచ్చె జనపాలునకున్.

**పటిగపంట 4-12-1930.**

## ఆదర్శ వీరుఁడు

అది మొగల్‌పాదుషా యౌరంగజేబు రా - జ్య మొనర్చు పదియునేడవశతాబ్ది
అది భారతీయదాస్యాంధకారప్రభల్ - దోబూచు లాడెడి దుర్దినంబు
అది పరస్పరమైత్రి యడుగంటి హైందవుల్ - లోలో నెదుర్చు దుష్కాలఘటిక
అది స్వాభిమానరక్షార్థియై బెదరి హిం - దూమతం బల్లాడు దుర్ముహూర్త
మది నిజకుమారదైన్యదశావలోక - జనిత సంతాపపావకజ్వాలికా వి
తప్తమానసయై భారతంపుజనని - వేఁడికన్నీరు గార్చెడు విసపుఁబ్రొద్దు.

మతవిద్వేషముహెచ్చి సిక్కులు ముసల్మానుల్ విజృంభించి వి
శ్రుతశౌర్యం బనివార్యవీర్యము రణక్షోణిం బ్రదర్శించి క
ల్పతరుప్రాంతలతాకుటీరగత రంభామేనకాద్యప్సర
స్సతతాలింగనభోగభాగ్యకలనాసంతుష్టులై రత్తఱిన్.

ఈడంబోవని మగఁటిమి
తోడన్ బెక్కేఁడు లెదిరి తుద కొక రణమం
దోడిరి సిక్కులు; తురకలు
పాడిరి జయగీతములు నభం బద్రువంగన్

చిక్కెం గాలవశంబున
సిక్కుగురూత్తముఁడు సర్వసేనాపతి పే
రెక్కిన తేజబహద్దరు
దిక్కెల్లఁ జెడన్ మహమ్మదీయుల చేతన్

మలక లతనిం గడుంగడుఁ
గులుకుచు బంధించి విజయకోలాహలముల్
బలియ న్గొని, చని నిల్పిరి
సలాము లొనరించి పాదుసాకట్టెదుటన్.

సంతోషాంబుధి నోలలాడుచుఁ బ్రశంసంజేసె నౌరంగజే
బెంతేని న్దనవారి; నంతట నహో! యివ్వీరు లెవ్వారు దు
ర్దాంతాహంకృతులైన సిక్కుదొరలా తథ్యంబు! వీరేల మా
చెంతం జేరి రటంచు నమ్మగని నాక్షేపించి యిట్లాడెడిన్.

పొగరెగసి మొగలువీరుల
మగఁటిమి గనవైతి వింతమాత్రము నౌరా!
తగరు నగరాజు నెద్రిచిన
పగిదిం జరియించి తింతవట్టు వెడంగా!

చిక్కితివి, దక్కితివి, మొగల్‌సింగమునకు
నేఁటికిటు వంటయింటికుందేల వైతి
బహదరూ! దిక్కుమాలినపక్షివిపుడు
బ్రదుకుపైనాసయున్న నాముదల వినుమ.

నా కనుసన్నల మెలఁగుము,
నా కొలువు న్గొలిచి మన్నన ల్గాంచుము, నా
మూఁకకు నొక్కటి కేలిక
వై కనుమా, నిస్సమాన మైన యశంబున్.

కాదనక, సిక్కుమతమున్
బోఁదోలుము, మన్మతంబు భూషింపుము, నా
యాదరమున వర్ధిల్లుము,
లేదా, చచ్చెదవు, జాలిలే దీతనికిన్

నావుఁడు, సిక్కుదంట, చిఱునవ్వు మొగంబునఁ దాండవింప ఢి
ల్లీవిభుతోడ నిట్లను, బలే! యవనాధిప! నీ వివేక మీ
త్రోవలఁ బట్టుటొప్పనె! విరోధి వశంగతుఁడైన వేళ నే
యే విధి నాడఁజెల్లు నొకయింత యెఱుంగ విఁకేమి సెప్పదున్.

మీసముదువ్వి శాత్రవులమీఁదికి దూఁకుమగండు, విక్రమో
ల్లాస విభాసియై రిపుబలంబుల నొక్కపు డోర్చు నొక్కచో
గాసికిఁ జిక్కుఁగాని నిజగౌరవనాశకవృత్తి కాతఁ డె
ట్లాసపడంగ నేర్చు వినవా! కనవా! మొనగాండ్రచెయ్దముల్.

మతమునెడ విజ్ఞుఁడు బలా
త్కృతి సల్పునె; యది మనుష్య నిచ్ఛావశమౌ
ట తగదె; యాస్తిక్యముగల
మత మెయ్యది యైన సుజనమాన్యముగాదే!

విశ్వవిఖ్యాతసభ్యతావిలసితంబు
భారతావని ధర్మంబుపట్టుఁగొమ్ము
నీకు నెలవుగదా! యేమి నేర్చి తిందుఁ
గమలసౌరభ మది యెంత కప్ప తెలిసె

దుర్వారప్రథన క్రియాచతురతాదుర్ధర్షులై మించు మా
పూర్వుల్ పెక్కురు దేశమాతృచరణంబుల్ చిత్తమందూని యీ
యుర్వి న్గార్చినరక్త మిప్పటికి నోహో! యింకి పోలేదు, నీ
గర్వోక్తుల్ ఫలియింపఁజాలునె, వివేకంబున్న నూహింపుమా!

చచ్చెదు, సచ్చె దంచుఁ బలుసారులు హెచ్చరికించె దేల, యీ
చచ్చుటకై భయంపడి విశాంపతులెల్లరు నవ్వ నేఁడు నీ

బిచ్చము నిచ్చగించి రిపుభీకరభారతజాతి కీతఁ డే
మచ్చయుఁ దెచ్చిపెట్టఁడుసుమా! విడువందగు నీప్రలాపముల్

చావనివాఁ డెవండు జితశత్రులు సప్తసముద్రముద్రిత
క్ష్మావలయాధిపత్యపరిసర్పితకీర్తులు చక్రవర్తు లే
లీ వచియింపు; కీర్తి యొకఁడే యమరత్వము గన్నదోయి త
త్సేవకె ధారవోయుదురు జీవము భారతవీరశేఖరుల్.

చిక్కినవానిఁ బట్టి వధసేయుదు నందువు, దానిఁ దీర్ప నే
మ్రుక్కడిసాలఁ డోయి బలమున్, మగపాడియు నున్న దేని పే
రెక్కినకత్తినిచ్చి యిపుడే యెదిరింపుము నన్ను, నీకు నా
సిక్కుఁదనంబునంగల విశేషము సూపెద నొక్క వ్రేల్మిడిన్

తెలియవొకో! సిక్కుల ని
స్తులధైర్యస్థైర్యశౌర్యధూర్వహనకలా
బలలబ్ధయశః పిహితా
ఖిల దిక్కుల భారతోర్వికి నలంకృతులన్

ముప్పదికోట్లమానవుల మూర్ధములన్ దనసేయుశాసనం
బెప్పుడు నిల్పఁగోరు ధరణీశుఁ డిటుల్ నయబద్ధపద్ధతిన్
దప్పిన, వానిరాజ్య మయథాతథమై సెడకున్నె, వానికిన్
ముప్పలు పెల్లురేఁగి తలమున్కలుగావె మదిన్ దలంపుమా!

క్రూరతనూఁది నీ విపుడు కోసెదు నా శిర; మంతమాత్రఁ జే
కూరదు నీకు సంతస మకుంఠితశౌర్యులు సిక్కుజోదు లీ
వీరునినెత్రుచుక్క కొక వేవురుపుట్టి మొగల్ప్రభుత్వధా
త్రీరుహమున్ బెకల్తురు గరిష్ఠులు కుంకటివేరు లూడఁగన్.

నిచ్చలు గుండెగాల మయి నిన్నుఁ గలంచు మగండు నేఁటితోఁ
జచ్చెను జచ్చెనంచు నిఁక సంబరమంద కతండు రేప తా
వచ్చు రణోర్వి కొక్కవరవర్ణినిగర్భమునుండి మార్తురన్
గ్రుచ్చు నిశాతభల్లమునకున్ జయలక్ష్మి కవుంగిలింపఁగన్.

వీరాగ్రేసరు లిద్ధతేజులు జగద్విఖ్యాతకీర్తుల్ మహో
దారుల్ భారతపుత్రు లాత్మజననీదాస్యంబు మాయింప దు
ర్వారోత్సాహమునన్నిజాంగము తృణప్రాయంబుగా నిత్తు లీ
ధీరోదాత్తచరిత్ర నీకు నిపుడేఁ దెల్లంబు గావించెదన్.

ఉక్కున్ జక్కటి వీడక
యెక్కటియై సిక్కువీరుఁ డివ్విధిఁ బల్కన్
మొక్కలమున కెంతయుఁ బే
రెక్కిన యమ్మానవేంద్రుఁ డెంతయు నల్కన్.

తోఁకంద్రొక్కిన నాగుఁబా మగుచు హద్దుల్మీఱి, కన్నుంగవన్
మూఁకల్మూఁకలు విస్ఫులింగములు నిర్ముక్తంబులై క్రాల న
స్తోకస్థైర్యుని భారతీప్రియసుతస్తోమాగ్రణిన్ బౌరుష
శ్రీకందమ్మును సిక్కువీరుఁ గబళించెన్ బెంచె దుష్కీర్తులన్.

**పటిగపంట - 10-8-1934**

(భగత్‌సింగు నురితీసిన సమయము)

## నా కథ - సీత

(ఆశువు-మిత్రులవ్రాఁతకు వీలుగా 30 నిముషములలో చెప్పబడినది)

వసుధాసవిత్రి నన్నుం
బ్రసవింప మదీయపుణ్యపరిపాకమునన్
వసపడితి యోగవిద్యా
రసికుఁడు జనకునకు జనక రాగము వడయన్.

జనకుఁడు కన్నబిడ్డవలె సాఁకి, ననున్ గడుముద్దుసేయ, మ
జ్జననము సార్థకం బనుచు సంబరమందితి, నందచందముల్
పెనఁగొన నెల్లవిద్యలను బెంపువహించితి, నస్త్రశస్త్రముల్
గని, నెఱనేర్పు లందితి, జగమ్మునవారు సమాదరింపఁగన్.

కడచినది నాదుబాల్యము
పొడమెను జవ్వనము వీరపురుషోత్తము నా
యొడయనిఁగావింప గురుం
డుడుగని తలపోఁతమునిఁగె నురలెడి కూర్మిన్

శివుఁ డెపుడో తద్భూపతి
భవనమ్మున విడిచె ధనువు; ప్రాఁతదియైనన్
లవమాత్రమ్మును సడలక
హవణిల్లుచునుండె నది నవాతినవంబై.

హరకోదండము దాని నెవ్వఁడు సముద్య ద్బాహువీర్యమ్మునన్
విఱుగంజేయు నతండ మత్ప్రియుఁడుగాఁ బృథ్వీశుఁడూహించి యీ
ధరలోనంగలరాజనందనుల వందల్‌వేలు రావించి సుం
దరపద్యన్ నడిపెన్ స్వయంవరము పెద్దల్‌పిన్నలున్ మెచ్చఁగన్.

ధరణీఖండము లన్నిట
నెఱిగల నృపసుతులు వచ్చి నిక్కిరి గర్విం
చిరి; శివుని వింటి ముంగడఁ
బరాక్రమముసూపి రెల్లపాటులతోడన్.

ఒకనిబడి నొకఁడుగా వ
చ్చి! కరోద్ధతి చూపి పరువుసెడెనే యనుచుం

**కథాకవిత్వము**

గకవికలు సెంది సభ్యులు
పకపక నవ్వంగ టిచ్చపడి రవ్వేళన్.

జలధరశ్యాముఁ డొక్కఁ డాసభకువచ్చె
నపుడు చూపఱకన్ను లాహా! యనంగ
వీరరాఘవుఁ డతఁడు తద్విక్రమమ్ము.
సకలరాజకుమార విస్మయకరమ్ము

బెండువలె నతఁడు వింటిని
రెండుగ నొనరించి శౌర్యరేఖ వెలార్చెన్
బండువు చేపడె నాకున్
దండిగ ముద మొదవె జనకధరణీపతికిన్.

తూర్యములు మొరసెఁ గవితా
ధుర్యుల దీవనలు కురిసె ద్రుహిణాదుల ము
చ్చర్యలు విరిసెం బురము న
వార్యంబై కౌతుకప్రవాహం బొరసెన్.

మంగళగీతికల్ మధురమంజులరీతుల సాగ నప్పయో
దాంగుఁడు మత్కరంబును సమాదరబుద్ధి గ్రహించినంతఁ బే
రంగద నున్నలోకమున కగ్గపడెన్ బ్రమదమ్ము, రక్కసుల్
భంగపడంగఁ దగ్గతటి వచ్చెనటంచుఁ దలంచి రెల్లరున్.

"నాపొత్తులేని శౌర్యా
టోపం బది యెంతయున్న డొంగను దనుజున్
బాపొత్మని రఘురాముఁడు
రూపడఁపంగలఁడె నిర్జరులు జయపెట్టన్.

సతితోడు లేనివేళలఁ
బతి యెంతటివీరుఁడైనఁ బండితుఁడైనన్.
నుతికెక్కఁగలఁడె" యని నా
మతి నెన్నోతలఁపు లపుడు మల్లడిగొనియెన్.

నోఁచిననోములు పండెను.
దాఁచినధనమెల్లఁ గరగతంబయి వచ్చెన్
నా చారుమూర్తి మధుర
శ్రీ చిక్కణపేటి వీరసింహుఁడు దొరకన్.

మగనితోడఁ గూడి మనిచినవారికై
నతులుసెప్పి చెలులమతులు తేర్చి
యత్తవారియింటి కప్పుడు పయనమై
వచ్చుచున్నదాన వనపథాన.

"మానిత విక్రమబంధురుఁ
డే నుండఁగ నీతఁ డెవ్వఁ డీశ్వరచాప
శ్రీనడఁప" ననుచు భార్గవ
సూనుం డెదిరించె రక్కసులబలుగొంగన్.

ఆ ముదివగ్గు రాముఁడన నర్భకుఁడంచుఁ దలంచిశౌర్యమున్.
స్థేమముఁజూపి శస్త్రవితతిన్ బరఁగించెనకాని యెవ్వ రీ
భూమిని మత్త్రియుం బొదివి పోవఁగలా రసుకోటితోడ?లే
రీమహిఁగాదు లోకములనెందయినన్ విభు నోర్చు పోటరుల్.

పరశురాముండు వితథమై పొడువడిన
తనమగంటిమిఁ దలఁచి సిగ్గున మునింగె
వలదు వలదు ప్రభూ! లజ్జవలదు నీ ప్ర
సాద మిది యంచుఁ బలికె భూజానిమౌళి.

ఆ వినయ మా సుశీలత
యా విక్రమలక్ష్మి భార్గవాత్మజునకు మో
దావహ మయ్యెను బతిపై
దీవనలన్ గురిసె నతఁడు దివ్యలు కులుకన్.

అఖిలసభ్యజనారాధ్యయగు నయోధ్య
కపుడుసేరితి మేము రావమ్మయనుచు
నా పసిండి! యటంచు హృత్తాప మెడసి
యత్త ననుఁగౌగిలించె రేకెత్తుప్రేమ.

కౌసల్యకు మామయ్యకు
నాసలు పండినవి నాఁడు; "నాకేశునకే
నీ సంతోషము కలదా?
త్రోసితి నఘ" మంచు దశరథుఁడు కడు సొగసెన్.

"కొడుకునకుఁదగ్గ కోడలిఁ
బడసితిఁ బరిమళము పొడమె బంగారునకున్
గడగండ్లతోడఁ దపముల
బడలి బడలి కంటి నిట్టిభాగ్య" మటంచున్.

మామగారు తనదుమది పొంగ మంగళా
రవము లెల్లయెడలఁ జెవులపండు
వులు ఘటింప నుత్తముల విప్రులను బిల్చి
పండితులను జేర్చి ప్రబ్బుకొన్న.

కౌతుకముతోడ వస్తు
వ్రాతమ్మును కాన్కవెట్టి వరణీయాన్న

**కథాకవిత్వము**

శ్రీతతు లొసంగి మఱి కా
ఫీ తేనీ రిచ్చి పెద్దవిందులు నడిపెన్.

ఒక యయోధ్యకనానేల యుర్వికెల్ల
నవ్యసంక్రాంతి యయ్యె నానాఁడు దశర
థేశునింటన కా, దెల్లయిండ్లయందుఁ
జక్కఁగాఁ జాగినవి పెండ్లి సంబరములు.

రామునితోఁ దత్సోదరు
లా ముప్పురు పెండ్లియాడి రంచితశీల
శ్రీ మెఱయు నూర్మిళాదుల
రామారత్నముల మధురరాగాంచితలన్.

ముగురత్తలు నేరాండ్రొక
ముగురున్ లభియించి హర్షమున మించిరి నన్;
జగదేకవీరుఁ డగువిభుఁ
డగపడె మామయ్య పూజ్యుఁ డబ్బెను దనకున్.

అల్లారుముద్దుగా నా
యిల్లున్ దిద్దుకొనుచుంటి; నిట్లుండ మహీ
వల్లభుఁడు జరావృతుఁడై
డిల్లపడె నిలా భరణ పటిష్ఠత సడలన్.

పెద్దకొడుకు ననుఁగుబిడ్డను రాఘవు
నఖిలశాస్త్రవేది నంచితాత్ము
నధిపుఁ జేయనెంచె నపుడు వసిష్ఠాది
మునులు మెచ్చి రతఁడు కనినతెఱఁగు.

రామపట్టాభిషేకకార్యము సమీప
మయ్యె "నే రాణి నౌదు" నటన్నవేడ్క
ననుఁబెనంగొనెఁగాని తిన్నందనమ్ము
నెడసి విధియింతలోఁ గొంపకెసరువెట్టె.

మామయ్య మున్ను దనుజ
స్తోమమ్మును ద్రుంచుపట్ల సుడివడఁ గైకా
భామిని సంగ్రామకలా
శ్రీ మిగులన్ గాసెకట్టి జీవితనాథున్

మృతికిదూరుఁజేసి మెప్పించెనఁట-మామ
యపుడు రెండువరము లామె కిచ్చె
నఁట-తదీయశక్తి నాయమ్మ "నాసుతు
భరతురాజుఁజేయవలయు" ననుడు.

పెద్దవాఁడు వాసి తద్దయుఁ గలవాఁడు
రాముఁ డుండఁగా భరతున కెట్లు
రాజ్య మిత్తు నవ్వరా ప్రజ లిది విన్న?
నని కలంగె దశరథావనిపుఁడు.

లోక మెటు లాడుకొన్నను
వాకును దప్పంగ నర్కవంశ్యుల కగునా?
యీ కార్యము తప్పని దని
యేఁకారుట మానె మానవేశ్వరుఁ డంతన్

కన్నకొడుకు తోఁడు కావుట చాలక
యధిపు వనికిఁ బంపి రత్తగారు;
జంటవిడక మగని నంటి జీవించుటే
పడఁతిధర్మ మన్న పాడి నెఱిఁగి.

తొనఁకక యేనునున్ మగనితో వనభూమికిఁ బైనమైతిఁ గా
ననములు శైలరాజము లనంతమరుక్షితులున్ గ్రమించి యొ
య్యన చని దండకావనమునందు వసించితి మెల్లమెల్ల మా
యునికి నెఱింగి సర్వమును లుబ్ధి రహో! విడరానిబంధులై.

అన్నదెసభక్తి నాతని
వెన్నడి లక్ష్మణుఁడు వచ్చె విపినమ్ములకున్
నన్ను రఘురాము నిచ్చలు
కన్నుల నిల్పికొని పూజ కావించుకొనెన్.

సౌమిత్రి యండకల్గుట
రామునకున్ నాకు వని పురంబయి తోఁచెన్
నామగఁడే దేవుం డని
ప్రేమించెడి ఋషులఁ జూచి పెరిఁగితి నేనున్.

“దేవుఁడు రాముఁడైన మఱి దేవి మహీజయకా” యటంచు నే
భావమునం దెలర్చితిఁ దపంబులు పండుటఁజేసి రాఘవ
క్ష్మావరు కేలుపట్టితి యశమ్మునుగంటి నయోధ్యయైన నా
కీ వనమైన నొక్కతెఱఁగే” యనుతృప్తిని గంటి నవ్వలన్.

తనయనుజన్ దనమిత్రులఁ
దనబంధులఁ జంపె రామధరణీశుఁ డటం
చెనలేని రోసమున రా
వణుఁ డసురుసురయ్యె “నెంతవచ్చె” నటంచున్.

లోకములనెల్ల గెల్చిన
నాకా యిటుసేఁత యల్పనరుఁ?డంచు మదో

ద్రేకమున లేచి యపర పి
నాకి వలెన్ సాహసించి నాథుని కుటికిన్

బంగరులేడిగా నొకయభాగ్యుని దానవుఁ బంపి భర్తకున్
భంగముతెచ్చి లక్ష్మణునిప్రాపును గోల్పడి యేను బేలనై
యంగద నుండునట్టు లకటా! వలపన్ని పిసాళిజోగి రీ
తిం గొని నన్నుఁజేరి వితథీకృతనీతి యతం డతంద్రుఁడై.

దిక్కులేని నన్నుఁ దక్కొని లంకకుఁ
జేర్చినాఁ డఘమ్ము పేర్చినాఁడు
దయఁదొఱంగి కొఱవిదయ్యాల నాచుట్టుఁ
బెట్టినాఁడు దనుజుఁ డెట్టివాఁడొ.

"జగముల గెల్చినట్టి రణశౌండుఁడ, సర్వదిగీశవర్గముల్
పగవిడి నన్నుఁగొల్చు, ననపాయము రాజ్యమునాది, రాముఁడా
మగఁడగు నీకు? నీమధురమంజులరూప మదేడ వానిపైఁ
దగుల మదేడ బుద్ధివలదా యిటువంటి మనోజ్ఞమూర్తికిన్.

నీకుఁ దగినమగఁడ నే నని, పదితలల్
కలవు నా కటంచు గర్వ మెగయ
నను బలాత్కరింప నానాశ్రమల్ పడి
నాఁడు ఱీచ్చపోయినాఁడు తుదకు.

అతఁడు హరుఁడైన నేమీ
పతివ్రతను ధిక్కరించు బలసంపద నే
గతి వడయు? నస్త్రజాలము
నతి సేయఁగవలయు సాధునారీమణికిన్.

ప్రాణేశుకొఱకు వార్చుచుఁ
బ్రాణమ్ముల బిగ్గఁబట్టి పరమకిరాత
శ్రేణుల జంకెనలం బడి
గ్లానిన్ గాలమ్ము నెట్లొ కడపితి లంకన్

అంత హనుమ వచ్చి కాంతునిజాడ నా
చెవినివైచి లంకచెలువ మార్చె
వనధిఁగట్టి మగఁ డవారితుఁడై దశ
గ్రీవుఁ దునిమె నమరకీర్తి వెలయ.

రామునితో నతదేవ
స్తోమునితోఁ బురికిఁ జనితి దుఃఖము లడఁగన్
మామయ్య లేమిఁ దలఁచితి
నేమీ ద్వంద్వములు తప్పవే యనుకొంటిన్.

పట్టాభిషిక్తుఁడై విభు
డిట్టలమగు నెమ్మి నవని నేలుచునుండన్
నెట్టికసీలతనమ్మును
బట్టి రఘుప్రవరు నేను బాయక కొల్తున్.

ఇది నాకథ - కౌసల్యా
సుదతీసుతుఁ డాదరించు సుకృతము, నా పా
లిదిగా నిదిగాంచితి, రా
ము దయన్ భువనములకెల్ల ముదములొదవుతన్.

**శబల - 29-05-1953**

## మంచి మేల్కొన్నది

అది గయామండలమ్మునం దలరుపల్లె
యచటు చిన్నజమీన్‌దారు నాటపట్టు
వచ్చె నట కెండవానల వండ కోర్చి
పేద కాదరువైన భావేదళమ్ము.

ఆ దొర యాదరమున్ గని
భూదానము నడుగ మనసుపుట్టిన၊ తత్స
ర్వోదయ సమాజసభ్యుల
కాదట నిట్లనిరి యూరి యందలి మిత్రుల్.

"ఈతేఁడు తులువతనమున
నీరేడు జగాలఁగెల్చు; నిఁక వీని కిసీ!
మైరేయమె యాహారము
వారనిజూదంబె వీనివలపై నడుచున్

మీరు కా దెవ్వరైన నీ క్రూరునడత
మార్చఁజాలరు వీఁ డొకమనిసి కాఁడు
రిత్తపని యేల వీని దర్శించు టుడిగి
తరలుఁడీ వేగ వేఱొకదారిఁ బట్టి".

కార్యకర్తల చేతులు కాళ్ళు చల్ల
పడియె నాసామికొఱగానిబ్రదుకు వినఁగ
నాత్మబలమేచియున్నయుదాత్తచరిత
విమలయొక్కర్తుకయెపట్టువిడువదాయె.

ఆయమ్మ దరహాసమలర నెయ్యురను - గని పల్కు "నన్నలు! కనుఁడు సత్యమ్ము
బడలి మానవులలో భగవానుఁ జూడఁ-దలఁచి పైనించుసాధకులము మనము
పరమేశ్వరప్రేమ ప్రాప్తించుదనుక - జగదీశుపుణ్యదర్శన మబ్బుదనుక
గుడి వీడి వెలికి నేగుట పాడియౌనె? - మతిమాలి నిస్పృహ మరగుట తగునె?

మనవినోబాయుద్యమమునవ్వులాట-వంటిదా? యలఁతులవంటిదా? చెపుఁడు
తులలేని లోఁతులోఁతులఁ బాదుకొన్న - మానవతానిష్ఠ మనమూలబంధ;
మా నిష్ఠగలప్రజ నీక్షింపకున్న - నీ నిష్ఠగలక్రాంతి నీక్షింపకున్న
మనకేమిఫలమయా? మనకేమిబలము? - మనజన్మమున కబ్బు మాన్యతయేమి?"

ఎంత సెప్పిన నేమి యాయింతిమాట
మెచ్చలేక మిత్రులు పొలమేర దాఁటి;
రొక్క విమలయె రవి సెగల్ క్రక్కువేళ
రాజభవనమ్ము సేరె ధీరత వెలుంగ

పంచలోఁ గూర్కుచున్నాఁడు ప్రభువు; తలుపు
నటునిటున్ గదలించె నాయతివమిన్న
యదరిపడి రాయఁ"డెవరువా"రనుచు నార్చె
"నేను మీచెల్లెల" నటంచు నెలఁత నుడివె.

చెల్లె లనుమాట వినుటనె
త్రుళ్ళిపడెన్ రాజు, వెఱ్ఱితో నెవ్వతయే
నిల్లుం ద్రొక్కెనె యని మది
కల్లోలమువోలెఁ గదలఁ గాఱియచెందెన్.

అంత విమలను జూచి యాయింతి యిచటి
కెట్లు రానేర్చుఁ? గారణమేమిదీని
రాకడ? కటంచు గొణఁగి యారామ నవల
హెచ్చరించుచు నీరీతి నుచ్చరించె.

"ఏను దుష్టుఁడ నూరెల్ల నెఱుఁగు నన్ను
నొక్కఁడును జెప్పలేదె నాయోజ నీకు
మంచివారికి నావంటి క్రించుతోడ
నేమిపనివచ్చు నీవు రానేల యిటకు.

అదిగాక నీవు చక్కని
సుదతివి జవ్వనపుఁ బెంపుసొంపులు నీలోఁ
గుదురుకొనియుండె నీ వీ
సదనము వేవేగ వీడి చను టొప్పుఁ జుమీ!"

అపుడు విమల పల్కె 'నన్నయా! నాకు నీ
దుష్టమైన వృత్తితోఁ బనేమి?
ఒక్కమాట కొసఁగు ముత్తరమును నీకుఁ
దల్లిలేదె? చిట్టిచెలిలేదె?

ఆ తల్లికి నాచెల్లిలి
కీతావు స్పృశింపరాని దెట్లగు? భక్తిన్

బ్రీతిన్ వారలఁ గనవా?
నీ తులువతనమ్ము వారి నెట్టునె వెలికిన్?

ఏను నొక క్రొత్తచెలియల
నై నినుఁ గనుఁగొన్నదాన; నాచార్యవినో
బా నెఱుఁగుదువు గదా! యతఁ
డీ నేలకు వచ్చినట్టి యీశ్వరుఁడుగదా!

ఆతఁ డుగ్రతపః కృశీభూతుఁ డాతఁ
డున్నత శరీరయష్టిసంపన్నుఁ డాతఁ
డాత్మసందర్శ నోజ్జ్వల దక్షియుగళుఁ
డాతఁ డార్షమహస్సున కానవాలు.

ఎల్లమతములసారంబునెఱుఁగునతఁడు
సర్వధర్మంబులనుమెచ్చుసాధు వతఁడు
సకలభాషలు, విద్యలు చక్క నేర్చి
వాణి మగరూపుగా నుతుల్ వడసె నతఁడు.

దుర్ధ రావేశమునఁ దప్పత్రోవఁ బట్టు
దేశభక్తిని గాంధేయదిశకు మలఁచి
సత్యసంసక్తిమై నహింసాప్రవృత్తి
మై గరిష్ఠతఁ గను కర్మయోగి యతఁడు.

జగతి యింద్రియసుఖలాలసతకు లోఁగి
కామ్యకర్మానుగతికమై కదలువేళ
నిత్య నిరవద్య నిగ్రహనిష్ఠ కండ
దండయై నిల్చు నూర్ధ్వరేతస్కుఁ డతఁడు.

పరమగుహ్యమ్ము, గీతా నిబంధితమ్ము
బ్రహ్మవిద్యను పసులకాపరికి సైత
మెఱుకపడునట్లుగా నింతలింతలైన
కథలుగాఁ బ్రవచించిన బుధుఁ డతండు.

వ్యక్తిసత్యాగ్రహ ప్రధనాంగణమున
నిలువఁజాలిన మొదటిసైనికుఁడుగా మ
హాత్మునుల్లములోఁగొన్న యనఘుఁడతఁడు
వీరులకువింతగొల్పిన వీరుఁడతఁడు.

ఒక మహాశాస్త్రమర్యాద నొందివెలసె
నతఁడు చేపట్టినంతన యలఁతి కదురు
ఒక మహావేదబుక్కు వానికిఁ గరంగి
చల్లచల్లని దేశియై వెల్లివిరిసె.

**కథాకవిత్వము**

తత్త్వవిద్యకు, విజ్ఞానతంత్రమునకు
సఖ్యమేర్పడవలయు విశ్వము సుఖింప;
బుద్ధికిని మనస్సునకును బొసఁగుపాటు
లేనిచో నుర్విచెడునన్న జ్ఞానియతఁడు

కుత్తుకలు గోసి నెత్తురుకూడు గాదు
తృష్ణలనుద్రుంచి యమృతమందించునతఁడు
విప్లవము కాదు, వానిది విశ్వశాంతి
కాదరువుగా నెసంగు సర్వోదయంబు.

అది సర్వోదయరుక్త్రసార, మది వహ్నిజ్వాలికామాలికా
స్వద నిర్భాగ్యనరప్రపంచముఖ వర్షావారివాహచ్ఛ టా
భ్యుదితాసారము ధర్మపూర మఖిలాంహోవాసనాదూర మ
య్యది భావేపరమర్షిబోధిత మహీయస్త్యాగసారమ్మురా!

జనచయమ్ములు దేవతాగణము లయ్యే
దాతలెల్లరు హోతలై తరలివచ్చి
రుభయతారక మగుశాంతి యురలి పారలె
నతఁడు భూదానయజ్ఞ దీక్షితుఁడు కాఁగ

కలిమి నిచ్చిరి, ముక్కారుపొలము నిచ్చి,
రొడలి నిచ్చిరి, బ్రదు కిచ్చి, రోటలేక
బాపురే! వాని పయనించుబాటలందు
నిండె నీవులు పుణ్యముల్ పండిపోయె.

కానరాఁడిఁక బాపూజీ కనుల కనుచు
శోకమయమూర్తియై క్రుంగు లోకమునకుఁ
బట్టుఁగొమ్మగ నిల్చిన యట్టి దీన
బాంధవుఁడు పావనుఁడు 'వినోబా' యతండు

కోటి కొకఁడేని వానికి దీటువచ్చు
పురుషుఁ డుండిన మహికి రాచఱిక మేల
శాసనము లేల యస్త్రశస్త్రమ్ములేల
ధర్మదేవత నాల్గుపాదముల నడువ.

ఆతని సందేశముతో
నీతలుపుం దట్టితట్టి నిద్ర దొలఁచితిన్
నా తప్పలున్న సైఁపుము
నీ తప్పలు నే నెఱుంగనేరను రాజా!

ఏ నూరక చనుచెల్లిని
గాను; మహీదానయజ్ఞకంకణ మిది నీ

పాణిం గట్టిన వెన్కనె
పైనము సాగింతు నొండుపల్లియదెసకున్".

రాజునోట మాట రాదాయె;నతఁ డెంత
నిందు్యఁ డైననేమి? నేఁడు వాని
మదిని గుబ్బువెట్టు మంచి మేల్కొన్నది
బ్రదుకు మాఱె నతనిభవము మాఱె

అతని పునర్జన్మమునకు
జతపడి యేర్పడిన పురుటిస్నానం బన సం
తతధారలఁ గోష్ణోదక
తతు లక్షులనుండి వెడలి తడిపెన్ నృపతిన్.

ఱేఁడు విమల నాదరించెను లెంకగాఁ
జేయిమోడ్చె నా సుశీలముందు
రమ్ము తల్లి! కృపను రమ్ము లోపలి కని
పెద్దచేసి చెలికిఁ బీఁటవైచె

"న న్నుద్ధరింపఁగా శ్రీ
మన్నారాయణుఁడు పంపె మగువా! నిను నేఁ
డన్నన్న! నన్నుఁ దేర్చిన
పున్నెము! నీపాలి" దనుచుఁ బొగడెను సాధ్విన్.

ఊరినెల్లఁ బిలిచె నొకసభ గావించెఁ
దనచరిత్రమెల్ల వినిచి క్రుంగె
సొంతకమ్మతమున మంతుగన్న పొలంబు
పెల్లుగా నొసంగెఁ బేదకొఱకు.

ఒక్కతఱిదెబ్బదిని డాఁగియుండుఁగాక
మానవునిహృదయమ్ములో మంచి కలదు
పాత్రులగువార లర్థించుపట్టునందు
నుబుకు నువ్వెత్తుగా నది యొదుఁగలేక.

(సర్వోదయగానము అక్టోబరు 1960)

## నా కొడుకులు సోమరులు కారాదు

అది సాగరాఖ్య మగుజన
పద; మచటన్ భూమిదానపరమార్థము కో
విదుఁడు వినోబా చాటెను
గదలెన్ దానములు విశ్వకల్యాణముల్.

ఒకఁ ముదుసలి "నాకడ నా
ఱెకరాలధరిత్రి యుండె నిది పేదలపా

లికి నర్పించెద నన" "జీ
వికి నీ కెది" యనె గురుండు విభ్రాంతమతిన్.

"కూలిచేసి కూడు గుడ్డ నార్జింతు నీ
నేల కిచ్చినదియుఁ గూలిసొమ్మె"
యనివచించె వృద్ధుఁ; డాచార్యుఁ" డుంద్రుగా
కుఱ్ఱవాండ్రు నీకుఁ గొంద" ఱనియె.

"ఉన్నారు నాకు మువ్వురు
పిన్నలు; వారలకుఁ బంచిపెట్టను బొలమున్
నన్నుంబలె శ్రమపడి వా
రన్నము దినవలయు నిష్ట మగు నిది' నాకున్.

కొడుకులను సోమరులఁజేయుకోర్కి లేని
మానిసిని నేను; సోమరిమహికివ్రేఁగు;
మేలు కీ డెల్ల నరసి యీనేల నీకు
నిచ్చుచున్నాఁడఁ గొను" మని వృద్ధు పల్కె.

ఈ దానము లోకోత్తర
మీదాతను దొరయువార లెందఱు కల రం
చాదరమేదురదృక్కుల
కాదరువుం జేసి మెచ్చి రాతని సభ్యుల్.

**(సర్వోదయగానము - అక్టోబరు 1960)**

## ముక్తి పాఠము

అతఁడిటుల్‌పల్కె నోప్రభూ!యస్మదక్షి
పాపవాంఛల నొదవించు రూపములను
గానకుండునటుల్ నను గావుమయ్య!
గ్రుడ్డితనమైన మంచి దీ జడ్డుకంటె.

అతఁ డిటుల్ పల్కె నోదేవ!యస్మదధర
మనుచితములైనవచనమ్ములాడియాడి
మైలపడకుండునట్లు నన్ మనుపుమయ్య!
మూఁగతనమైన మంచి దీ ముప్పకంటె.

అతఁడిటుల్‌పల్కె నోతండ్రి! యస్మదీయ
కర్ణములు హేయమైన వాక్యముల నాల
కింపకుండునటుల్ కరుణింపుమయ్య!
చెవిటితనమైన మంచి దీ చెట్టకంటె.

అతఁ డిటుల్ పల్కె నోనాథ! యస్మదాత్మ
పరసతులపట్ల వికృతపుంబాట త్రొక్క

కుండునట్లనయంబు న న్నోముమయ్య!
మృత్యువైనను మంచి దీ యెగ్గుకంటె.

అతఁడు తుకారాముఁడు తన
బ్రతుకున్ హరిసేవ కిచ్చి పండిన ధన్యుం
డతఁ డెల్లరయందు జగ
త్పతి నవలోకింపఁగన్న భక్తాగ్రణియున్.

ఒక్కనాఁడు తోఁటప్రక్కగా నేగెడి
సాధుమౌళి నతనిఁ జక్కఁ జూచి
సేద్యగాఁ డొకండు చేమోడ్చి నాతండ్రి!
కొంచెమాఁగు మనుచుఁ గొసరికొసరి

ముదిరిముదిరి యున్న ముంగారు చెఱకుదం
టులనుద్రెంచి కట్టి "యలఁతికాన్క
యిది పరిగ్రహింపవే" యని భక్తుని
మూఁపుమీఁద నిడియె మోపు దెచ్చి.

పిన్నలకుఁ బెద్దలకుఁ దన తెన్నునందుఁ
గన్పడినవారికెల్ల నాగడలు పంచి
కొసకుమిగిలినయొకతుంటనొసఁగె హొర్ద
మెసఁగ రాముఁడు తనచానకిల్లుసేరి.

ఆ కోపన యీ యొక్కటి
నీ కిచ్చిన బుద్ధిలేని నిర్భాగ్యుఁ డెవం
డీ కట్నమె పదివేలని
యీకొని నీవెట్లు తెచ్చియిచ్చితి నాకున్.

మతిపోయినదా! నీ కని
పతి నాగడతోడ నాల్గుబాఁదులు బాఁదెన్.
క్షితి రెండై పడె నిక్షువు;
యతచిత్తుండైనరాముఁ డపు డిట్లనియెన్.

నెలఁత! నాదెసనీకున్న నెయ్యమునకుఁ
దియ్యమునకు నెల్లలులేమి తెలిసికొంటి
నీ వొకర్తవె తినుటకు నిష్టపడక
చెఱకుదంటును రెండుగాఁ జేయుకతన.

అతికర్కశమగు ఘటనము
నతులప్రియతారసార్ద్ర మగు న ట్లొనరిం
చి తితిక్షాశేవధి నా
బ్రతికి తుకారాము ముక్తిపాఠము గఱపెన్.

**కదంబకైత - 13-03-1973**

# గృహస్థధర్మము

అతఁడు పరివ్రాజకుఁ డా
యతి పుణ్యక్షేత్ర దర్శనాసక్త మతిన్
క్షితినెల్లం దిరుగుచు నొ
క్క తటిన్ జనుదెంచె నొక్క కటకమ్మునకున్.

మూఁడు నాళ్లయ్యె నతఁ డన్నమునకు నోఁచి
సైఁపలేఁడాయె సంన్యాసి జాఠరాగ్ని
అరిగె నంత "భిక్షాందేహి" యనుచుఁ బెక్కు
తావులకు బోడ యడుగులు తడఁబడంగ.

వంట యగుచున్న దనె నొక్కయింటి మగువ
మరల రమ్మనె నొక్కమందిరపులేమ
నేఁడు వీలుగా దనె నొక్కనెలవు నెలఁత
మెతుకు నిష్ఫచ్ఛయయ్యె నయ్యతికి నపుడు.

ఉస్సురనుచు బోడి యొకవీథిలోఁ గూలి
యింత మహికి నన్న మిడు ప్రభుండు
నన్నుఁ ద్రోయఁ గారణంబేమి? యే నెట్టి
యెగ్గు సల్పినాఁడ? నిట్లు కుముల.

ఓ పరమేశ్వర! నను రా
రాపులఁ బెట్టకుము కనికరమ్మునఁ గను మే
నాపన్నుఁడ నా ప్రాణము
గాపాడు మటంచుఁ బెక్కుగతులన్ వగచెన్.

భగవంతుఁడప్పు డొక వృ
ద్ధగ నయ్యమిమౌళిమ్రోలఁ దోఁచి యలఁతిగా
నగుచున్ "మనుజుల నడుగక
వగచెదవేలయ్య వెఱ్ఱి పట్టెనె నీకున్".

అనవుఁడు "నే నెందఱినో
కని వేఁడితి భిక్షనరులు కారా వారల్?
నను వెఱ్ఱి పట్టె నందువు
నినుఁ బట్టిన దందు నే" ననెన్ యతి పెలుచన్.

ముసలి నవ్వి నవ్వి రుసరుస యేల నీ
కన్నవారు నరులు గారు బోడి!
యీ సులోచనంబు లిడెదను వీనితోఁ
జూడుమని బిరాన సురిఁగిపోయె.

తబిసి యబ్రపడుచుఁదాత యిచ్చిన కంటి
జోడు నవధరించి చూచెఁ బురము

నదిర! వీటివార లంద ఱాతనికి భీ
కరమృగమ్ములట్లు కానఁబడిరి.

ఒక్కఁడు సింహముగా, నిం
కొక్కఁడు శార్దూలముగ, మఱొక్కఁ డెలుఁగుగా,
నొక్కఁడు ములుపందిగ, వే
ఱొక్కఁడు తిమ్మఁడుగఁ, దోఁచె నోరలనెల్లన్.

అద్దములఁదీసిచూచెనా యన్నిదెసల
మానవులెకాని మఱియొండు ప్రాణి లేదు;
ఏమివిడ్డూరమిదియని స్వామి మురిసి
తిరిగి తిరిగి పట్టణమెల్లఁ దేఱిచూచె.

రాచబాటప్రక్క నేచి తనర్చిన
రావినీడఁ బాదరక్ష కుట్టి
కుక్షి నింపుకొనెడి గొడగరి మాత్ర మే
రీతిఁ గనిన నరునిభాతిఁ బొలిచె.

విస్మయంపడి సన్యాసి వీట నీతఁ
డొక్కఁడే నరుఁడా! యిది నిక్కమైనఁ
జనునె యే నిస్సిరో! కడజాతివాని
బిచ్చమడుగుట గొద నెంత నొచ్చుచున్న.

ఏను; వీడు; లోక మిదియెల్ల నాత్మప
దార్థమగుట రూఢ మౌనుగాని
దిక్కుమాలినట్టి దేహాభిమానంబు
కదలదయ్యెఁ నన్ను వదలదయ్యెఁ.

వనజభవునుండి చిఱుచీమ వఱకు నఖిల
కాయముల సాక్షిగా నిల్చి క్రాలునట్టి
దొక్కచైతన్యమే యని వక్కణించు
చదువు నేర్చియు నేర్వని జడుఁడ నైతి.

గంగయందుఁ దోఁచు కమలాప్తునకును మా
తంగవాసి నలరు తరణికిని ర
వంతయేని భేద మగుపడునా యింత
తెలిసి దారిదప్ప దేబె నైతి.

చేకొని 'త్వయి మయి చాన్య
త్రైకో విష్ణు" వను సూక్తి నెన్నోసభలన్.
వాకొంటిఁ గాని పూర్ణ వి
వేకము గననైతి మబ్బువీడమి నకటా!

చే(తలకు రాని కూ(తల
వ్రా(తల నెవ్వనికి ముక్తివచ్చును విశ్వ
ప్రీతి వెలివిరిసి తేఱిన
చేతమ్మున( దక్క సమతచేతను దక్కున్.

అని వగచు పరివ్రాజకు
ననుతాపము చర్మకారు( డాత్మబలమునన్.
గని యతిరాజా! మ్రొక్కులు
కొను(డనియెన్ వినయభార కుంచిత తనువై.

మీయంగద మీ యఱమర
మీ యలజడి గంటి సంయమీ!యి(క దిగులున్.
ద్రోయు(డు మీమదికింపగు
చాయన్ దొల(గింతు మీ విచారము ననియెన్.

మధురభక్ష్యంబులమ్ము బ్రాహ్మణుని విపణి
తనకునెదురుగనుంటనత్తావునకుయ
తీంద్రునింజేర్చి యీసామియెంతకోరు
నంతయిమ్ముమితాయి విప్రాగ్ర!యనియె.

నే( డేను సిద్ధపఱిచిన
జోడునకున్ ముట్టునట్టి సొమ్మెల్లను నీ
కోడక యిచ్చెద ననె నెద
యీడెఱు(గని కరుణ పొంగి యివతాళింపన్.

మంచిదనియె బేరి; మస్కరి బూరె లో
బ్బట్లు లడ్లు కోవ లంగరొల్లె
లొ(గు లఱిసె లాదియైన పణ్యారముల్.
కుతుకబంటి గా(గ( గుడిచి త్రే(చె.

రాజును మంత్రియు నపుడే
వాజులపై వచ్చి రటకు; వారికి వినయ
శ్రీ(జాటి గొడగరి యెదో
తా(జెప్ప( దలంచి వెఱపు దందడిసేయన్.

పలుకలేక తొట్రుపడుచుండ నోయి! జం
కేల? నీ తలంపు నెఱుకపఱుపు
మనె మహీధవుండు; మన సప్పు పొదునం
బడ(గ నుడివె నిట్లు పాదుకృత్తు.

దేవరా! చర్మకారవృత్తిని రవంత
నేర్పుగలవా(డనే; నిని' నే(డు తీర్చి

నట్టి చెప్పలు, చక్కని గట్టిచెప్ప
లర్థమగు మూల్య మిడి వీని నందుకొనవె!

అనుడుమానవేంద్రుఁ డతనికిశతరూప్య
ములకుఁ జాలు పసిఁడిముద్ర నొసఁగె
నేల యింతపైఁడి యీ తోలుముక్కల
కోదొరా! యటంచుఁ బేద బెదరె.

ఏమో నామది కరఁగిన
దీమాత్రకు నన్నుఁ బ్రోత్సహించిన దిది హె
చ్చో మఱి లొచ్చో తడవకు
భీ మాను మటంచు రాజు ప్రేమలు కురిసెన్.

తా మెంత యిచ్చినను నే
నా మొత్తము నెల్ల నీ బెహారి కిడవలెన్
భూమీశ!;యనెగొడారి, య
దేమనెఁ? బతి; యతఁడు గ్రంథమెల్లను వినిచెన్.

ఆ జోడు నిట్లు తెమ్మని
రాజు నిజాక్షులకుఁ జేర్చ రథ్యాజన మా
భూజాని కుగ్రజంతు స
మాజమయై కానిపించె మది ఱిచ్చపడన్.

తాను సింగముగ, బ్రధానుండు బెబ్బులి
గా, వణిక్కు కొంగగా, యతీశుఁ
డావుగా, గొడారి యతఁ డొక్కఁడె నరుండు
గా ధరాధిపతికిఁ గానిపించె.

దొరకు నావహిల్లె దొరలేని యబ్ర; మా
యయ్య చర్మకారు నట్టె చూచి
యెట్లు వచ్చె నీకు నింత గొప్పతనమ్ము?
మమ్ముఁ జుట్టుకొన్న మైల యెద్ది?

మాదిగవు కావు నీఁ వ
న్నా! దివి నెడఁబాసి భువికి నరుదెంచిన వే
ల్పొదు వన; వలదు వలదు మ
హోదయ! న న్నింత మెచ్చు టుచితం బగునే!

శ్రుతులు నేర్వలేదు, వ్రతములు పాటింప
లేదు, తపము సేయలేదు, నదుల
మునుఁగ లేదు జన్నముల నేను గావింప
లేదు, సురలఁ దేర్పలేదు, గాని-

**కథాకవిత్వము**

ఈశ్వరార్పణ దృష్టితో నెల్లపనులు
పూనెదను నేను ఫలసంగబుద్ధి లేక
వచ్చుబడియందు సగముపాలిచ్చుచుందు
నతిథి కభ్యాగతునకు నిండారుపేర్మి.

కడమసగములో సగమ్ము నా పితరుల
కర్హమైన తిండికై వ్యయింతు
మిగిలినట్టి నాలుగగుపాలు వెచ్చింతు
నా కుటుంబమున కనారతముగ.

ఏను బడసినట్టి మానవత్వమున కీ
నియతి హేతు వగునె నృపవతంస!
యింతనాఁటినుండి యిదియ నా జీవన
మార్గ మనె వినీతిమై గొడారి.

రా జపుడు కన్నువిచ్చి యౌరా! త్వదీయ
పథము సామాన్యమా! యోగివరుఁడ వీవు
ధర్మమున కవలంబమై తనరె దీవు
దయకు నెలవైన మానవోత్తముఁడ వీవు

చదువులేకున్న నేమి కోవిదులమదికి
బెదరు పుట్టించు నెఱుక నేలెదవు నీవు
నా గురుండవు నీవని నాఁటినుండి
తన్ను దిద్దుకొనెం, బ్రజాతతిని దిద్దె.

యాగమునకంటె, గేహ
త్యాగమ్మునకంటె, నధికతర పుణ్యద మౌ
యోగము గృహస్థధర్మము,
రాగము రావలయు మోక్షరతులకు నిందున్.

తల్లి నాశ్రయించి పిల్లలందఱు సుఖ
మందు రీతి లాఁతి యాశ్రమంబు
లన్నియును గృహస్థు నండదండల నార్తి
భారదూరమైన బ్రదుకుఁగాంచు.

అతిథిశిష్టమైన యన్నము, నిజ వధూ
తృప్తి, దానశీల, మింద్రియముల
నగ్గపఱుచుకొంట, యణఁకువ, పితృభక్తి
వలచుగేస్తుఁ జూచి వణఁకు నఘము.

**కదంబకైత - 25-02-1974.**

## తెనుఁగు తల్లీ!

తెనుఁగు తల్లీ! నీకు జోహారు దేశమాతా! నీకు జేజేలు
నినుఁ జూచి నినుఁ బాడి నినుఁ గొల్చువేళ నా
కను లాణిముత్యాల గనులుగా నగు నహెూ!

ఏ పుణ్యలేశమ్ము నా పాలి దాయెనో
నా పూజ కే లోకనాథుండు పొంగెనో
నీ పావనోదర శ్రీపరంపరలలో
నీ పదార్చకులలో నేను నొక్కఁడ నైతి.

## తెలుఁగుభాషా ప్రశస్తి

నీతీరుతీయముల్ నిగ్గుజగ్గులు సూచి, బ్రౌను బ్రహ్మరథంబు పట్టె నీకు
నీ ఠీవి నీ హెుయల్ నీ బెడంగులు మెచ్చి, యిబ్రహీమ్ కానుక లిచ్చె నీకు
నీ సొంపు నీ పెంపు నీ యొయార మెఱింగి, శాహజీ పరిచర్య సలిపె నీకు
నీ తేట నీ పాట నీ నీటు దిలకించి, యఱవలెల్లరు దాసులైరి నీకు
ముజ్జగంబుల నినుఁబోలు ముద్దుగుమ్మ, రసికతావేత్తలకుఁ గానరాదు రాదు
ఏ పురాపుణ్యలేశమో యిటకుఁ దెచ్చి, యర్చకునిజేసె నన్ను నీ కాంధ్రవాణి!

దారిదప్పినట్టి తమ్ములారా! పరాకుఁ, దెలిసికొండు తగిన దెసకు రండు
తేనెసోనవోని తెనుఁగును సేవించు, తీరు గనుఁడు తనివి గూరి మనుఁడు.

## ఆకాంక్ష

ఎట్టి కఠోరదీక్షలు సహించితినో తొలుబామునందు, నీ
కెట్టిదళంబు లెట్టివిరులిచ్చి నమస్య లొనర్చినాఁడనో,
పుట్టితి నీ సుతుండనయి పోఁడిమిగంటిని తల్లి! వీనికిన్
బెట్టుము భిక్ష నీ యనుఁగుబిడ్డఁడుగా నెపుడున్ జనింపఁగన్.

నీ రమణీయమూర్తి కమనీయవచస్స్ఫురణంబు దాతృతా
గౌరవ మద్వితీయరసికత్వవిభూతి విశిష్టశౌర్య వి
ద్యారుచిరత్వ మెంత కొనియాడిన మత్కవితాపిపాస చ
ల్లాఱ దదేమి తల్లి! యిది యాఱక మాఱక యిట్లె నిల్చుతన్.

నాకే కాదు భవచ్చరిత్రము లనన్యప్రాప్యధారా రస
శ్రీకంద మ్మన నందగించు కవితన్ చిత్రించు భాగ్యంబు ను
ద్రేకస్ఫూర్తియు నస్మదీయమగు పుత్రీపుత్రకశ్రేణి కీ
వాకల్పాంత మనుగ్రహింపఁగదవమ్మా! ఆంధ్రవీరప్రసూ!

## జాతి గర్వింపదగ్గ మహాకవి

"సర్వతంత్ర స్వతంత్రుడౌ సత్కవీంద్రు డెన్నడో కల్పమున కొక్కడే లభించు" - తెనుఁగులెంక, అభినవతిక్కన, గాంధి ఆస్థానకవియైన తుమ్మల సీతారామమూర్తిగారు తెలుగు జాతికి, సాహిత్యమునకు 20వ శతాబ్దమునందు లభించిన అపూర్వమైన కానుక. వారు కవితా హిమాలయము; పాండితీ మేరునగము. వారు ప్రతిభావంతులేగాదు, వ్యుత్పన్నులు కూడ. వారు ఆకారములో ఆంధ్రుడు; ధర్మములో భారతీయుడు; భావములో విశ్వమానవుడు. వారు ధర్మసంరక్షణార్థము కవితలల్లిన ఋషితుల్యులు. వారు ప్రాతక్రొత్తల మేలుకలయిక. ఆధునికాంధ్ర సాహితీజగత్తులో వారు యుగధర్మమును గుర్తించి, స్వతంత్రమార్గమున పయనించి, యుగకవితను సృష్టించిన యుగకవులు. వారికవితలో యుగధర్మమును విశ్వరూపమున గాంచగలము. వారు కవిత్వమును సమాజసేవాసాధనముగా భావించి, "సామాజిక కల్యాణము కామించెద నవ్యభవ్యకవితా సృష్టిన్" అని ప్రకటించి, వారు రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక, నైతిక విలువల పరిరక్షణకొరకు చైతన్యవంతమైన కవితను సృజించిన సాహితీప్రవక్తలు. వారు ఆంధ్రావళిమోదము కొరకు జగద్ధితమైనకవితను కళాన్వితముగ గానము చేసినారు. వారి కవిత వ్యవస్థలన్నింటికి సంగమస్థలము, సమధర్మము సహజధర్మమని నమ్మి, సమకాలీనసమస్యలను స్వీకరించి, వాటికి పరిష్కారమార్గములను సూచించుటయేగాక, సార్వకాలీనత నిచ్చినారు. వారి కవితాశయము ఆంధ్రుల అభ్యుదయము, భారతీయుల ప్రగతి, సమగ్రతలు, మానవజాతికల్యాణములు. సంప్రదాయము, సర్వోదయము, సార్వజనీనత, సౌందర్యము, సౌలభ్యములు వారి కవితాలక్షణములు. వారి కవితకు గాంధిధర్మము పట్టుగొమ్మ. గాంధేయ సిద్ధాంతములు భారతీయధర్మస్వరూపములని, సర్వోదయసిద్ధాంతములు విశ్వమానవకల్యాణకారకములని వారు విశ్వసించినారు. వారి రచనలు సత్యం శివం సుందరం అను ధర్మములకు నెలవులు. వారి కవితలో మానవతాపరిమళములు వెదజల్లు విశ్వసంస్కృతి కలదు; అది మానవుని సంస్కారవంతునిగా జేసి, సమాజమును ఉన్నతీకరించును. వారి కవితలో జాతిజీవనము సర్వతోముఖముగ ప్రతిబింబించుచుండును. వారి ప్రతిపద్యమునందు సాంఘికస్పృహ కలదు; అంతే గాదు తెలుగుకవితా సొగసుల పరిమళములు గుబాళించు చుండును. వారి కవిత వంద సం॥ల భారతదేశ చరిత్రకు దర్పణము. వారు జన్మించినది 1901; మరణించినది1990. అందువలన వారి కావ్యములు ఆంధ్రుల, భారతీయుల నవయుగ హృదయస్పందనలకు రమణీయమైన అక్షరరూపములు. నవీనాంధ్రసాహిత్యచరిత్రలో 20వ శతాబ్దమును "తుమ్మలయుగము" అని పేర్కొనవచ్చును. వారి కవిత పాఠకులకు భావప్రసన్నతను, హృదయవికాసమును, ఆనంద పారవశ్యమును, మానసికప్రశాంతతను కలిగించును. త్యాగరాజు సంగీతము, తుమ్మల సాహిత్యము ఒకే కోవకు చెందినది. అనగా అవి వినినకొలది ఇంకను వినవలెననియు, చదివినకొలది మరలమరల చదువవలెననియు అనిపించును. అవే నిజమైన కళలు; అజరామరమైనవి. వారిద్దరి సంగీతసాహిత్యములు రసికలోకపు తఱుగనిసిరులు.

తుమ్మలవారు కవిగా ఎంత ఉన్నతులో, వ్యక్తిగా అంతకంటే ఉన్నతులు. వారి జీవితమే ఒక సందేశము. వారు జీవించిన కాలమునందు జీవించుటే మహాభాగ్యమని సమకాలికులు భావించిరనిన అతిశయోక్తిగాదు. విశ్వజనీనమైన యుగకవితను సృష్టించిన, ఆదర్శవంతమైన జీవితమునుగడపిన మహాకవి 20వ శతాబ్దమునందు తుమ్మలవారు గాక మరొకరులేరనుట తెగువగాదు. తుమ్మల వారు "నా అమూల్యసంపద, నా గౌరవపతాక" అని జాతి గర్వించదగిన విశిష్టమైన మహాకవులు "తుమ్మల 20వ శతాబ్దియుగకవి; 21వ శతాబ్దపు యుగకర్త".